1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

ఆదివారం | సెప్టెంబర్ 01, 2024 | www.navatelangana.com

పిడుగుపాటుతో విద్యార్థిని మృతి



నవతెలంగాణ-నసురుల్లాబాద్

పిడుగుపాటుకు విద్యుదాఘాతంతో విద్యార్థిని మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలంలోని నాచుపల్లి గ్రామంలో శనివారం జరిగింది. నాచుపల్లి గ్రామానికి చెందిన గైని పోశెట్టి, రుక్మిణికి చెందిన చిన్న కూతురు గైని స్వాతి 18 అనే విద్యార్థిని సాయంత్రం భారీ వర్షంలో పిడుగు ఇంటి పక్కనే ఉన్న చెట్టుపై పడటంతో విద్యుత్ వైర్లు తగిలి ఇంటికి విద్యుత్ సరఫరా అయింది. ఈ విషయం తెలియక ఇంటి ఇనుప తలుపు మూసేందుకు తలుపులను ముట్టగా వెంటనే విద్యుత్ షాక్ తగిలి స్వాతి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న నాయబ్ తహశీల్దార్ భవయ్య, గీర్దావర్ హన్మాండ్లు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెరిక శ్రీనివాస్ విద్యుత్ అధికారులు చేరుకొని వివరాలను తెలుసుకున్నారు. అనంతరం బాలిక పిడుగుపాటుకు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు అధికారులు నిర్ధారించారు. దీనితో మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ బాలిక తల్లిదండ్రులకు ఆర్థిక సహాయం చేశారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నసురుల్లాబాద్ పోలీసులు తెలిపారు.

భారీ వర్షసూచన.. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రానున్న 48 గంటలలో జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు జిల్లా పాలనాధికారి రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం తెలిపారు. భారీ వర్షాల వల్ల జిల్లాలో ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్: 08462 - 220183 కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కంట్రోల్ రూమ్ నిరంతరం 24/7 పని చేస్తుందని, కంట్రోల్ రూమ్ ద్వారా సమాచార సేకరణ కోసం ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేశామన్నారు. భారీ వర్షాల వల్ల ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైనట్లు ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి సహాయక చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఏ సమయంలోనైనా ప్రజలు ఫోన్ ద్వారా కంట్రోల్ రూంకు సమాచారం తెలుపవచ్చని సూచించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టేలా ఆయా శాఖల అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశామని కలెక్టర్ తెలిపారు.

అంగట్లో అడవి జంతువుల మాంసం

- నిర్భయంగా విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్న వేటగాళ్లు

నవతెలంగాణ-రామారెడ్డి



అడవి జంతు మాంసం

వన్యప్రాణుల రక్షణకు అనేక చట్టాలున్నా.. వాటికి మాత్రం రక్షణ కరువవుతంది. వేటగాళ్లు విచ్చలవిడిగా వేటాడుతూ.. అటవీజంతువుల మాంసాన్ని ఏకంగా అంగట్లో విక్రయించడం గమనార్హం. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట గ్రామంలో శనివారం వేటగాళ్లు అడవి జంతువుల మాంసాన్ని విక్రయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో అడవి జంతువుల వేటకు వెళ్లి బండ రాళ్ళల్లో ఇరుక్కుపోయిన రెడ్డిపేట్ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ తర్వాత ఫారెస్ట్ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు. అయినా పట్టించుకోకుండా వేటగాళ్లు.. గుట్టుచప్పుడు కాకుండా అర్థరాత్రి వేళల్లో వేటకు వెళ్లి మూగజీవాలను చంపి, గ్రామాల్లో జంతువుల మాంసాన్ని విక్రయిస్తున్నారు. భవిష్యత్ తరాలకు అడవి సంపదను అందించవలసిన బాధ్యత మనందరిపై ఉంది. అడవి జంతువులను కాపాడేందుకు ఫారెస్ట్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, రాత్రి వేళల్లో అడవి పై ప్రత్యేక దృష్టి సాధించి, వేటగాళ్ల నుండి అడవికి, అడవి జంతువులకు రక్షణ కల్పించాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.



'లెండి'.. జగమొండి

- ఈసారైనా ప్రాజెక్టు పనులు ముందుకు సాగేనా..?
- ఎమ్మెల్యే సందర్శనతో చిగురిస్తున్న ఆశలు
- సుమారు 38 ఏండ్లుగా పెండింగ్‌లో అంతర్రాష్ట్ర లెండి ప్రాజెక్టు

నవతెలంగాణ-మద్నూర్

ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 38 ఏండ్లు అవుతున్నా ఓ సాగునీటి ప్రాజెక్టు పనులు ముందడుగు పడటం లేదు. రెండు రాష్ట్రాలు కలిసి సంయుక్తంగా నిర్మించాల్సి ఉన్నా.. ప్రభుత్వాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో పెండింగ్‌లో పడుతూ వస్తుంది. ఏండ్లుగా పనులు ముందడుగు పడకపోవడంతో లెండి ప్రాజెక్టు జగమొండిగా మారింది. అయితే తాజాగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంత్‌రావు ప్రాజెక్టును సందర్శించడంతో ప్రాజెక్టుపై మరోసారి ఆశలు చిగురిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా సంకల్పంతో ప్రాజెక్టు పనులు పూర్తి చేసి నియోజకవర్గంలోని భూములకు సాగునీరు అందేలా కృషి చేస్తుందో.. లేకుంటే గత ప్రభుత్వాల తీరు సమీక్షలకే పరిమితమవుతుందో అని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇటు తెలంగాణ అటు మహారాష్ట్ర ఇరు రాష్ట్రాల మధ్య లెండి ప్రాజెక్టును నిర్మించతలపెట్టారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో మహారాష్ట్ర వాటా 62 శాతం కాగా తెలంగాణ వాటా 38 శాతం. ఈ ఒప్పందంతో 1986 సంవత్సరంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అటు మహారాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయితే రాష్ట్రంలోని మద్నూర్‌తో పాటు డోంగ్లి, బిచ్కుంద మండలాల్లో సుమారు 25 వేల ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉంది. కానీ ఏండ్ల తరబడి పనులు పూర్తి కాకపోవడంతో ఈ లెండి ప్రాజెక్టు జగమొండిగా మారింది.

జగమొండి అంతర్రాష్ట్ర లెండి ప్రాజెక్టు పూర్తి చేయాలని గత ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యేను పలుమార్లు కోరారు. కానీ పనులు ముందడుగు పడలేవు. ప్రస్తుతం జుక్కల్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న తోట లక్ష్మీకాంతరావు అంతర్రాష్ట్ర లెండి ప్రాజెక్టు పెండింగ్ విషయంలో పలుమార్లు ఇటు తెలంగాణ ఇరిగేషన్ శాఖ అధికారులతో అటు మహారాష్ట్ర లెండి ప్రాజెక్ట్ అధికారులతో ప్రత్యేకంగా రివ్యూ మీటింగ్‌లు నిర్వహించారు. అధికారుల సూచనల మేరకు ఎమ్మెల్యే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి అలాగే భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ప్రాజెక్టు పనులు పూర్తి కావడానికి తెలంగాణ ప్రభుత్వం ముందుకు వచ్చినట్టు సమాచారం.

ఈ నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు మహారాష్ట్ర ప్రాంతంలో నిర్మిస్తున్న అంతర్రాష్ట్ర లేండి ప్రాజెక్టును సందర్శించారు. అక్కడ జరుగుతున్న ప్రాజెక్టు పనులను పరిశీలించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే



లెండి ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు

ప్రాజెక్టు సందర్శన కోసం తెలంగాణ ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులను తీసుకువెళ్లారు. అధికారులతో పాటు తెలంగాణ పత్రికా మీడియాను కూడా తీసుకువెళ్లారు. ప్రాజెక్టు నిర్మాణానికి కావలసిన నిధుల గురించి ఇరు రాష్ట్రాల అధికారులతో చర్చించారు. పనులు ఏ విధంగా చేపడితే ఎప్పటి వరకు పూర్తి చేయగలమనేది సమాచారాన్ని సేకరించారు. ఇరు రాష్ట్రాల అధికారుల అంచనాల ప్రకారం ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు సహకరించుకుంటే 2025 సంవత్సరం చివరి నాటికి పూర్తి అయ్యే అవకాశాలు ఉన్నాయని ఎమ్మెల్యే ప్రాజెక్టు సందర్శన కార్యక్రమంలో తెలియ వచ్చింది. ఈ ప్రాజెక్టు ఒప్పందాల ప్రకారం 2007 నాటికి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి ఆయంలోని పూర్తి కావాల్సి ఉండగా ఇప్పటివరకు ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావడంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత కెసిఆర్ ప్రభుత్వం మహారాష్ట్ర ప్రభుత్వంతో ప్రత్యేకంగా చర్చలు జరిపినప్పటికీ ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ఊసే లేకుండా పోయింది.

ఈ ప్రభుత్వ హాయంలో పూర్తి అయితే గత వైయస్ రాజశేఖర్ రెడ్డి హాయంలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి హాయంలో పూర్తి అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే పట్టుదలతో ఎమ్మెల్యే ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీటిని అందిస్తే ఆయన జుక్కల్ నియోజకవర్గం లోని మద్నూర్ డోంగ్లి బిచ్కుంద మూడు మండలాల ప్రజల్లో జీవితాంతం గుర్తుండిపోతారు.

సమీక్షలేనా.. పనులు ముందుకు సాగేనా..?

అయితే సమీక్షలకే పరిమితమా.. పనులు చేపట్టేనా..? అని స్థానికంగా ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ ఏడాది చివర్లో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతమున్న ప్రభుత్వమే మళ్లీ వస్తే ఇప్పటి వరకు జరిగిన చర్చలు ఉపయోగకరంగా ఉండే అవకాశం ఉంది. ఒక వేళ ప్రభుత్వం మారితే మళ్లీ మొదటికి వచ్చే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో లెండి ప్రాజెక్టు అంశం ముందుకు తీసుకొస్తున్నట్టు సైతం ఆరోపణలు లేకపోలేదు.

గురుకుల విద్యార్థిని మృతి

- అప్రమత్తమైన అధికారులు
- నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు : సబ్ కలెక్టర్ కిరణ్మయి

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)



మాట్లాడుతున్న పలువురు

బాన్సువాడ మైనారిటీ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న అంజలి(12) అనే విద్యార్థిని అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చేసింది. జుక్కల్ మండలం పడంపల్లి గ్రామానికి చెందిన అంజలి మూడు రోజులుగా జ్వరంతో బాధ పడుతోంది. ఉపాధ్యాయులు శుక్రవారం విద్యార్థిని తల్లికి సమాచారం ఇవ్వడంతో ఆమె అంజలిని బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లింది. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందడంతో బాలిక మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

ఈ విషయం తెలుసుకున్న బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి బాన్సువాడ మైనార్టీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల గదులను వసతి గృహాన్ని పరిశీలించారు. పలువురు విద్యార్థులు జ్వరంతో బాధపడుతున్న సమాచారం తెలుసుకొని వెంటనే వైద్య ఆరోగ్య శాఖకు సమాచారం అందించారు. గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని అప్రమత్తంగా ఉండాలంటూ ఆదేశించారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు స్టాఫ్ నర్స్ పోస్టు ఖాళీగా ఉందని వెంటనే భర్తీ చేయాలని విద్యార్థిని తల్లిదండ్రులు కోరడంతో ఈ విషయం ఉన్నతాధికారులకు వెంటనే ఏర్పాటు చేసి స్టాఫ్ నర్స్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గురుకుల పాఠశాలలో వెంటనే వైద్య శిబిరం ఏర్పాటు చేయాలంటూ జిల్లా అధికారులకు ఆదేశించడంతో జిల్లా ఉపవైద్యాధికారిణి డాక్టర్ విద్య ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలలో వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో 520 మంది విద్యార్థులకు గాను 83 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఇందులో 13 మంది విద్యార్థినీలకు జ్వరం ఉన్నట్లు గుర్తించారు ఇందులో మరో ఐదుగురు మంది విద్యార్థినీలకు తీవ్రమైన జ్వరం ఉన్నట్లు రక్త పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు జ్వరం తగ్గేవరకు ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారని వారి వైద్య ఆరోగ్య సేవలు కొనసాగుతాయని సిహెచ్ఓ దయానంద్ తెలిపారు. అలాగే బాన్సువాడ టౌన్ సిఐ కృష్ణ గురుకుల పాఠశాలను సందర్శించి వివరాలను సేకరించారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఎవరు ఆందోళనలు చెందవద్దని సూచించారు. వీరి వెంట ఆర్సీవో కిరణ్ గౌడ్, డీఎండబ్ల్యూవో విద్య సిఇచ్ఓ దయానంద్ తదితరులు ఉన్నారు.

నీతి తప్పుతున్న నేతలు



- లాడ్జిలో యువతితో రాసలీలలు నెరుపుతూ పట్టుబడ్డ బోధన్ కౌన్సిలర్ గంగారాం
- ఇటీవల ఓ యువతిని కారులో తరలించిన మరో కౌన్సిలర్

నవతెలంగాణ-బోధన్

ప్రజల చేత ప్రజాప్రతినిధులుగా ఎన్నిక్కైన వారే సభ్యసమాజం తలదించుకునేలా వ్యవహరిస్తే జనం ఓట్లేయడానికే భయపడే పరిస్థితులు నెలకొంటున్నాయి. రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధులయితేనేమి, మండల స్థాయి ప్రజాప్రతినిధులయితేనేమి వారు చేసే నీచపు పనులతో సమాజంలో చులకనవుతున్నారు. బోధన్ మున్సిపల్‌లోని పలువురు కౌన్సిలర్‌ల తీరు వివాదాస్పద మవుతుంది. ఇటీవల ఓ కౌన్సిలర్ ఓ యువతిని కారులో తీసుకెళ్లి లైంగికదాడికి యత్నించగా స్థానికులు పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాజాగా మరో కౌన్సిలర్ గంగారం ఏకంగా లాడ్జ్‌లో ఓ యువతితో రాసలీలలు నెరుపుతూ పట్టుబడ్డారు. దీంతో కౌన్సిలర్‌ల తీరు సర్వత్రా చర్చనీయాంశం అవుతుంది.

కౌన్సిలర్ల తీరుపై సర్వత్ర విమర్శలు

బోధన్ మున్సిపల్ కౌన్సిలర్లు రాధాకృష్ణ, బెంజర్ గంగారాం వ్యవహారంపై అంతటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కౌన్సిలర్ రాధాకృష్ణ ఎడపల్లి వద్ద ఓ యువతితో ఏకాంతంగా పట్టుబడడంతో స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గత కొన్ని రోజుల క్రితం కూడా ఇలాంటి కేసులో అరెస్టయి జైలు జీవితం అనుభవించారు. కానీ మళ్లీ అలాగే వ్యవహరించడంతో మహిళా సంఘాలు నిరసన చేపట్టారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారాం సైతం బోధన్ పట్టణంలోని ఓ లాడ్జిలో ఓ యువతితో రాసలీలలు నెరుపుతూ పట్టుబడ్డారు. ఓ పంచాయితీ విషయంలో సదరు యువతితో ఏర్పడిన పరిచయంతో ఇరువురు లాడ్జికి వచ్చినట్లు ప్రచారం జరుగుతుంది. అదే సమయంలో చూసిన వారు లాడ్జిలోనే పట్టుకుని కౌన్సిలర్‌కు దేహశుద్ధి చేశారు. దాంతో ప్రజాప్రతినిధులంటేనే జనంలో చులకనభావం ఏర్పడింది. పదిమందికి ఆదర్శంగా నిలిచే నాయకులు ఇలా నీతి తప్పడంతో సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇద్దరు కౌన్సిలర్లను సస్పెండ్ చేయాలి...

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ వచ్చిన ఆరోపణల నేపథ్యంలో పట్టుబడిన కౌన్సిలర్లు రాధాకృష్ణ, బెంజర్ గంగారాం లను మున్సిపల్ కౌన్సిల్ నుంచి సస్పెండ్ చేయాలని కౌన్సిలర్ మీర్ నజీర్ ఆలీ శనివారం జరిగిన మున్సిపల్ సమావేశంలో డిమాండ్ చేశారు. వారిని సస్పెండ్ చేస్తూ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వారి వ్యవహారం వలన బోధన్ మున్సిపల్ కౌన్సిల్ కు చెడ్డ పేరు వస్తుందని తన ఋుగ్వేదం వ్యక్తం చేశారు.

వికలాంగుల సాధికారతకు ప్రత్యేక పథకం ప్రకటించాలి

- ఎన్.పీ.ఆర్.డీ.రాష్ట్ర కార్యదర్శి ఆడివయ్య

నవతెలంగాణ-బోధన్



మాట్లాడుతున్న ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి ఆడివయ్య

వికలాంగుల సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక పథకం ప్రకటించాలని ఎన్.పీ.ఆర్.డీ రాష్ట్ర కార్యర్శి ఆడివయ్య డిమాండ్ చేశారు. శనివారం బోధన్ పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఎన్.పీ.ఆర్.డి నిజామాబాదు జిల్లా 3వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు .ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూవికలాంగుల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగుల పెన్షన్ 6000/-లకు పెంచి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల మౌలిక సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమలకు వికలాంగులు సిద్ధం కావాలని అన్నారు. దేశంలో తిండి లేక 10 కోట్ల మంది ప్రజలు అల్లాడుతుంటే కేంద్ర ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని అన్నారు. మోడీ పాలనలో నిరుద్యోగం పెరిగిందని అన్నారు. నిత్యావసర సరకుల ధరలు 300 శాతం పెంచి పేద, మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులకు గురించేస్తున్నారని అన్నారు. జీఎస్టీ తీసుకువచ్చి ప్రజలపై భారం వేసి సంపన్నులకు లక్షల కోట్ల రాయితీ ఇచ్చే హక్కు మోడీకి ఎక్కడిదని ప్రశ్నించారు. పేదరికం తగ్గిందని చెపుతున్న మోడీ 81 కోట్ల మందికి ఉచిత బియ్యం పంపిణి ఎందుకు చేయాల్సి వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

దేశంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత వికలాంగులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను రద్దు చేయాలని కుట్రలు చేస్తుందన్నారు. ఇప్పటి 2016 ఆర్పీడీ చట్టానికి కమిషనర్‌ను నియమించలేదని, నేషనల్ ట్రస్ట్ కు చైర్మన్ నియమించలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళ సాధికారతను ప్రోత్సాహించేందుకు మహిళా శక్తి క్యాంటిన్ పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు.2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో వికలాంగులకు 5 శాతం కేటాయించాలని ఉన్నప్పటికి మహిళా శక్తి క్యాంటిన్లలో ఎందుకు కేటాయించడం లేదన్నారు. మహిళా సాధికారత అంటే సకలాంగులైన మహిళల సాధికారత గురించి ఆలోచించడమే కాదని, మహిళా వికలాంగుల సాధికారత గురించి ప్రభుత్వాలు ఆలోచించాలని డిమాండ్ చేశారు.వికలాంగుల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో వికలాంగులు, వారి కుటుంబాలు దుర్భారమైన స్థితిలో ఉన్నాయని అన్నారు. వికలాంగుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవలని డిమాండ్ చేశారు. తీవ్ర వైకాల్యం కలిగిన వికలాంగులు, వారి కుటుంబ సభ్యులకు 25,000 ప్రత్యేక అలవెన్స్ చెల్లించే విదంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ రమేష్ బాబు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్.డీ.ఏ ప్రభుత్వం ప్రజల మౌలిక సమస్యలను పరిష్కారం చేయడం లేదన్నారు. పేదల సంపద అంత సంపన్నులకు దోచి పెడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధాని, అంబానీలా కోసం ఉందా లేదా పేద ప్రజల కోసం ఉందా అని ప్రశ్నించారు. ధరలు పెంచి సామాన్య ప్రజలపై భారం వేస్తున్నారని అన్నారు. నిత్యావసర సరకుల ధరల పెరుగుదలకు అనుగుణంగా పెన్షన్ కేంద్ర ప్రభుత్వం వాటా 5000/- లకు పెంచాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉపాధి చూపడం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ పరం చేస్తూన్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాలయాపన చేస్తున్నారని అన్నారు. పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సభలో రాష్ట్ర ఉపాధ్యక్షులు యం బస్వారాజు, ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షులు గంగాధప్ప, పీఎస్ఎం జిల్లా కార్యదర్శి సిర్పాలింగం, గ్రామ పంచాయతీ యూనియన్ కార్యదర్శి గంగాధర్,ఎన్ పీ ఆర్ డీ జిల్లా అధ్యక్షులు పి కవిత, జిల్లా నాయకులు గైని రాములు, రామ్ పటేల్, నజీర్, సాయమ్మ, నాగమణి, లక్ష్మణ్, గోపాల్,, గోపాల్ గౌడ్, శ్రీనివాస్, ఎల్లయ్య చింటూ, అస్మా బేగం, పెంట సాయిలు, గంగారాం లతో పాటు వివిధ మండలాల వికలాంగులు పాల్గొన్నారు.

కుల వృత్తికి అడ్డు రావొద్దు

- నాయి బ్రాహ్మణ కులస్తుల ఆందోళన

నవతెలంగాణ-ముప్కాల్



మాట్లాడుతున్న నాయి బ్రాహ్మణ కులస్తులు

ముప్కాల్ మండల కేంద్రంలోని నాయి బ్రాహ్మణ కులస్తులకు అన్యాయం జరుగుతుందని నాయి బ్రాహ్మణ మండల అధ్యక్షులు నల్లూర్ గంగాధర్ ఆరోపించారు. తమ కులవృత్తిన ఇతరులు చేపడితే తాము ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ముప్కాల్ మండల కేంద్రంలో మార్కెట్ యార్డ్ పక్కన జెంటిల్మెన్ హెయిర్ కటింగ్ షాపును గత రెండు రోజుల క్రితం మైనార్టీ వర్గానికి చెందిన సదరు వ్యక్తి ప్రారంభించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. మైనార్టీలు మంగలి వృత్తిని చేపట్టడంపై వారు స్పందిస్తూ ముస్లింలు మా వృత్తిని వారి వృత్తిగా మొదలుపెట్టడం, తమ కుల వృత్తిని అవమాన పరిచినట్లుగా ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నియోజవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా దుకాణం ప్రారంభించి సునీల్ రెడ్డిని సైతం తప్పుదోవ పట్టించారని అన్నారు. దీనికి నిరసనగా ఉమ్మడి బాల్కొండ నాయి బ్రాహ్మణ కులవృత్తుల దుకాణాలన్నీ గత రెండు రోజులుగా మూసి ఉంచారు. మైనార్టీ వ్యక్తి ప్రారంభించిన దుకాణంను మూసివేయాలని లేదంటే రానున్న రెండు, మూడు రోజుల్లో కార్యాచరణ రూపొందించుకొని జిల్లా మొత్తం పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ కుల వృత్తుదారుల మండల అధ్యక్షులు కడారి పెద్ద గంగాధర్, రాజు, గోపాల్, రామ్ కిషన్, రాకేష్, ప్రశాంత్, ఒడ్డెన్న, మంగలి చిన్నయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభించిన దుకాణం మైనార్టీ వ్యక్తిది కాదు

షాప్ యజమాని రణవీర్ వివరణ

మండల కేంద్రంలో గత రెండు రోజుల కిందట ప్రారంభించిన మంగలి దుకాణం తనదే అని కుదురుపాక రణవీర్ విలేకరులకు వివరించారు. గత కొన్ని సంవత్సరాలుగా మా తాతల కాలం నుంచి వస్తున్న వృత్తిని వదులుకొని వుండలేని పరిస్థితిలో నేను ఉపాధ్యాయ వృత్తిలో వుండటం వల్ల మా స్నేహితుడైన మైనార్టీ వ్యక్తికి నా షాప్ విధి నిర్వహణను అప్పగించినట్టు తెలిపారు. షాప్ కిరాయి విషయంలో మడిగే యజమానితో ఒప్పందం సైతం రాసుకున్నని తెలియజేశారు. ఇది తెలియని నాయి బ్రాహ్మణ కులస్తులు ఆందోళనలు చేయడం సరైంది కాదన్నారు.

భారీ వర్షంతో అతలాకుతలం

- బొమ్మన్‌దేవ్‌పల్లిలో ఇండ్లలోకి చేరిన వరద నీరు

నవతెలంగాణ-నసురుల్లాబాద్



బాన్సువాడ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల్లో శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. సుమారుగా మూడు గంటల పాటు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పొలాల్లో నీరు చేరి పంటలు దెబ్బతిన్నాయి. నసురుల్లాబాద్ మండలంలోని బొమ్మన్ దేవ్ పల్లి గ్రామంలో భారీ వర్షం కారణంగా వరదనీరు ఇండ్లలోకి వచ్చి చేరింది. దీనితో ప్రజలు నానావస్తు పడ్డారు.



ఆంకోల్ , దుర్కి మధ్యన ఉన్న వాగు పొంగి పొర్లుతుంది. భారీ వర్ష కారణంగా బీర్కూర్ కిష్టాపూర్ వెళ్లే ప్రధాన రహదారి బురదమయం కావడం వరద నీరు చేరడంతో ప్రయాణికులకు ఆటంకం కలిగింది.

క్రీడా దుస్తులు అందజేత


క్రీడా దుస్తులు అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ, క్రీడా స్ఫూర్తితో రాష్ట్రస్థాయికి ఎంపికైన టెన్నికాయిట్ క్రీడాకారులకు క్రీడా దుస్తులను మాజీ సర్పంచ్ సునంద ప్రభాకర్ రావు శనివారం అందజేశారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయికి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొని 8 మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేసిన మాజీ సర్పంచ్ సునంద ప్రభాకర్ రావును ఉపాధ్యాయులు, గ్రామస్తులు, అభినందించగా, క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సాయి మౌర్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పెద్ద చెరువు అలుగు వద్ద శనివారం ఉదయం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్టు కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం అందాజ 8 గంటల సమయంలో కామారెడ్డి పెద్ద చెరువు అలుగు వద్ద, ఒక గుర్తు తెలియని మగ మనిషి వయసు సుమారు 35-40 సంవత్సరాలు గల వ్యక్తి, ప్రమాదవశాత్తు కానీ లేదా మరేదైనా కారణం వల్ల గాని నీటిలో చనిపోయి ఉన్నాడు. ఇతను గత రెండు, మూడు రోజుల కిందట నీటిలో పడిపోయి ఉండవచ్చునని ఆయన ప్రకటనలో తెలిపారు. ఇట్టి వ్యక్తికి చెందినవిగా భావిస్తున్న బ్లూ కలర్ ప్యాంటు, గ్రీన్ మిక్స్ ఫుల్ హాండ్ షర్ట్, చెప్పులు గట్టు మీద ఉన్నాయన్నారు. ఇతని ఆనవాళ్లు గుర్తుపట్టిన ఎవరైనా కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్: 8712686145, 8712666242. సంప్రదించాలని సూచించారు.

ప్రవాసి సహాయత కేంద్రాన్ని సందర్శించిన ఈరవత్రి అనిల్



సహాయ కేంద్రం వద్ద అనిల్ తదితరులు

నవతెలంగాణ-బాల్కొండ

గల్ఫ్ తదితర దేశాలకు వెళ్లే వారికి సలహాలు, సూచనలు ఇవ్వడానికి హైదరాబాద్ ఎయిర్ పోర్టులోని డిపార్చర్స్ ఆవరణలో నిర్వహిస్తున్న 'ప్రవాసి సహాయత కేంద్రం' (మైగ్రంట్స్ హెల్ప్ డెస్క్)ను మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మిక, ఉపాధి శాఖ ఆధీనంలోని 'తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్' (టాంకాం), జీఎంఆర్ సంస్థలు సంయుక్తంగా ఈ హెల్ప్‌డెస్క్‌ను నిర్వహిస్తున్నాయని ఈ సౌకర్యాన్ని గల్ఫ్ దేశాలకు వెళ్లే కార్మికులు ఉపయోగించుకోవాలని అనిల్ కోరారు. మరిన్ని వివరాల కోసం హెల్ప్ డెస్క్ మొబైల్, వాట్సాప్ నెంబర్ 91 78935 66493కు కాల్‌చేసి సంప్రదించాలని తెలిపారు. ఆయన వెంట గల్ఫ్ కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి ఉన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 2న నిరసన కార్యక్రమం ఉంటుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ తెలిపారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రోజురోజు పెరుగుతున్న నిత్యావసర ధరలు తగ్గించకపోవడంతో ప్రజలపై మరింత భారం పెరుగుతుందని అన్నారు. 2021లో నిర్వహించాల్సిన జనాభా లెక్కలు నిర్వహించకపోవడం మూలంగా కొత్త రేషన్ కార్డుల జారీని రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసిందని ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినా.. రేషన్ కార్డులు మంజూరు చేయలేదన్నారు. మరో వైపు రేషన్ కార్డులు ఉన్న వారందరూ సెప్టెంబర్ 30లోపు తమ ఆధార్ (ఈ-కేవైసీని) అనుసంధానం చేసుకోకపోతే రేషన్ కార్డు రద్దు అవుతాయని ప్రభుత్వం ప్రకటించిందని వివరించారు. దీనివల్ల అనేకమంది ఇతర ప్రాంతాలకు వలసపోయిన కూలీలు, కార్మికులు రేషన్ కార్డులు కోల్పోయే ప్రమాదం ఉందని, ప్రభుత్వం ఈ-కేవైసీ నిబంధనలను రద్దు చేయడంతో పాటు జనాభా లెక్కలు పూర్తిచేసి అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. అందులో భాగంగా సెప్టెంబర్ 2న నిజామాబాద్ ధర్నా చౌక్‌లో ఉదయం 11 గంటలకు జరిగే నిరసన కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు ఏ.విటల్ గౌడ్, అమర్, ఆనంద్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

- బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్‌లలో డాక్టర్స్, సిబ్బంది నియామకాలు చేపట్టాలని బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్‌పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని బహుజన లెఫ్ట్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రంలో వైరల్ ఇన్ఫెక్షన్, డెంగీ జ్వరాల వల్ల ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రజలు మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి జిల్లా, మండల, గ్రామ పంచాయతీ పరిధిలలో హెల్త్, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖలతోపాటు ప్రైవేట్ డాక్టర్స్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో విస్తృతమైన హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు యుద్ధ ప్రాతిపదికన చికిత్సలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సబ్బని లత, నగర కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలి

- పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్
- యూనివర్సిటీలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్ర వ్యాప్తంగా రూ.8300 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ నిధులను పెండింగ్‌లో ఉంచటం సరైంది కాదని, వెంటనే నిధులను విడుదల చేయాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ముందు పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను చెల్లించకపోవటం వలన విద్యార్థులపైన అదనపు ఆర్థిక భారం పడుతుందని, కాలేజీలలో యూనివర్సిటీలలో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, విద్యార్థులకు చెల్లించే మెస్ చార్జీలు ధరలకు అనుకూలంగా పెంచాలని, ఇంచార్జీ వైస్ ఛాన్సలర్‌లతో యూనివర్సిటీలను నడపడం సరైంది కాదని అన్నారు. రెగ్యులర్ వీసీలను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ పిడిఎస్‌యూ నాయకులు ప్రిన్స్, రవీందర్, గోపి, రాకేష్, బాలాజీ, భారత్, మణికంఠ, నితిన్, దర్శు, తదితరులు పాల్గొన్నారు.

తరగతిగదికో ఉపాధ్యాయుడిని నియమించాలి

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్రంలోని ప్రతి ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టి పి టి ఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ అనిల్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని ప్రాథమిక పాఠశాలలకు పి.ఎస్.హెచ్.ఎం. పోస్టులను మంజూరు చేసి, డీఈడీతో పాటు బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. సభ్యత్వ నమోదులో భాగంగా శనివారం దోమకొండ , బీబీపేట్ మండలంలోని పలు పాఠశాలలను సందర్శిస్తూ, సమస్యలను సేకరించారు. 317 జీవో ద్వారా మ్యూచ్ వల్ బదిలీ చేయబడిన ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టాలన్నారు. 317 జీవోలో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు, పెండింగ్ లో ఉన్న 13 జిల్లాల స్పౌజ్ కేటగిరి ఉపాధ్యాయులకు వెంటనే న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ డాక్టర్ నాగభూషణం, జిల్లా కార్యదర్శి సిహెచ్ లింగం. ఏస్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్ష సూచన నేపథ్యంలో

అప్రమత్తంగా ఉండాలి

- అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు


నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రానున్న రెండు రోజులలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన దృష్ట్యా, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ, అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. ఎక్కడ కూడా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తుగానే అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ శనివారం సాయంత్రం సెల్ కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్అండ్‌బి, విద్యుత్, ఆర్టీసీ, ఇరిగేషన్, వైద్యారోగ్యం తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాగాల 48 గంటలలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువులు, వాగులు, కుంటల్లోకి వచ్చి చేరుతున్న వరద ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎక్కడ కూడా చెరువులకు గండ్లు పడకుండా నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ, తదనుగుణంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా కార్యస్థానాల్లో ఉంటూ పరిస్థితులను నిశితంగా పరిశీలించి ఎప్పటికప్పుడు సమాచారం అందించేలా చూడాలన్నారు. ఇంజనీరింగ్ విభాగాల అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ఎక్కడైనా వర్షాల వల్ల ఇబ్బందులు ఏర్పడితే వెంటనే సమాచారం అందించేలా సిబ్బందిని సమాయత్తం చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో సమర్థవంతంగా పనిచేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించి పునరావాస చర్యలు చేపట్టాలన్నారు. లో లెవెల్ వంతెనలు, కాజ్‌వేల వద్ద బస్సులు జాగ్రత్తగా నడిపేలా ఆర్టీసీ డ్రైవర్లను అప్రమత్తం చేయాలని ఆర్ఎంకు సూచించారు. అవసరమైతే వరద ప్రవాహం ఏర్పడే ప్రాంతాల మీదుగా వాహనాల రాకపోకలను నిషేధిస్తూ, ఇతర ప్రాంతాల మీదుగా దారి మళ్లించాలని అన్నారు. పట్టణ ప్రాంతాలలో డ్రైనేజీలు, మ్యాన్ హెూల్స్ కూరుకుపోయి వర్షపు జలాలు ఎక్కడికక్కడ నిలిచిపోయే అవకాశాలు ఉన్నందున, ముందస్తుగానే వాటిని శుభ్రం చేయించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌తో పాటు ఆయా కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లు 24 గంటల పాటు పనిచేసేలా అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, ఏదైనా సమాచారం అందిన వెంటనే అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. ఏ చిన్న నిర్లక్ష్యానికి సైతం తావివ్వకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

ఎగువ ప్రాంతాల నుండి వరద ప్రవాహం వచ్చి చేరే అవకాశం ఉన్నందున శ్రీరాంసాగర్ పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎవరు కూడా చేపల వేటకు ప్రాజెక్టులు, చెరువులు, నదులలో వెళ్లకుండా కట్టడి చేయాలని, ఆదివారం సెలవు దినమైనందున విద్యార్థులు, యువకులు ఈత సరదా కోసం చెరువులు, కుంటల వద్దకు వెళ్లకుండా నిలువరించాలని కలెక్టర్ సూచించారు. సెల్ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీపీఓ తరుణ్ కుమార్, సీపీఓ మల్లికార్జున్, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

- విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి
- డీఈవో దుర్గాప్రసాద్
- కేజీబీవీ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో డీఈఓ తనిఖీలు


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

నవతెలంగాణ-మాక్లూర్

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలు, భోజన వసతిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేస్తున్న వంటలను, కూరగాయలను పరిశీలించి, పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, విద్యార్థుల ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టడంతో పాటు, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే సమాచారం అందించి వైద్య సేవలు అందజేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి శోభ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి వీడ్కోలు



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ శాఖలో శనివారం పలువురు ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేశారు. సి.హెచ్. బాల్‌సింగ్ నాయక్, ఎస్సై, సి.యస్.బి, నిజామాబాద్ పోలీస్ శాఖలో 42 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసి ఉద్యోగ విరమణ పొందారు. ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించారు. వీరికి శాలువాలతో సత్కరించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. సర్టిఫికేటు (జ్ఞాపికలతో) ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ అదనపు డి.సి.పి (అడ్మిన్) బి.కోటేశ్వరరావు మాట్లాడుతూ.. పోలీస్‌శాఖలో ఎంతో పనిఒత్తిడితో విధులు నిర్వహించి ఎలాంటి రిమార్కు లేకుండా ఉద్యోగ విరమణ చేయడం ఎంతో గొప్ప విషయమని, ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పక ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ కార్యాలయం ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, బషీర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, ఎస్సైలు సంతోష్‌రెడ్డి, సాయన్న, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు షకీల్ పాషా వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో గ్రీన్ డే

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ అంగన్వాడీ కేంద్రంలో అమ్మ పేరు మీద ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా గ్రీన్ డే శనివారం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కిచెన్ గార్డెన్ ఏరియాలో మందార పువ్వు, కరివేపాకు మొక్కలను నాటినట్లు అంగన్వాడీ టీచర్ కే.సరిత తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల కేంద్రాలకు విచ్చేసే చిన్నారులకు వారి చిన్నతనం నుంచే మొక్కలపై ఆసక్తి కలిగించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆయా పసుపుల లక్ష్మీ, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ గాడిలా హనుమాన్ మందిరంలో అన్నదాన కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. శ్రావణమాసం పురస్కరించుకొని ప్రతి శనివారం ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- పది రోజుల క్రితమే ఆస్ట్రేలియా నుంచి వచ్చిన యువకుడు
- గ్రామంలో విషాదఛాయలు


రవి (ఫైల్)


తీవ్రంగా గాయపడి మృతిచెందిన రవి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్ర శివారులోని పాటి హనుమాన్ దేవాలయం సమీపంలో 63వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన సుంకేట రవి(28) అనే యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ద్విచక్ర వాహనంపై కమ్మర్‌పల్లి వైపు వస్తున్న రవిని జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వైపు ఎదురుగా వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై నుండి కింద పడిపోయిన రవి తలకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ రవిని 108 వాహనంలో ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగానే రవి మృతి చెందాడు. 10 రోజుల క్రితమే సుంకేట రవి ఆస్ట్రేలియా నుండి స్వగ్రామం వచ్చినట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా రవి తండ్రి కూడా గతంలోనే అనారోగ్యంతో మృతి చెందాడు. యువకుడు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రెవెన్యూ కార్యాలయం పేరిట ధరణి దందా..?

- టీ దుకాణాలు, ఇతర ప్రాంతాల్లో కూర్చుంటూ రెక్కీ
- డబ్బులు తీసుకొని పనులు పూర్తి చేయిస్తున్న వైనం
- అధికారుల పాత్రపై అనుమానాలు..?

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం పేరిట ధరణి దందా జోరుగా నడుస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కార్యాలయ అధికారుల పేరు చెప్తూ పలువురు రెక్కీ నిర్వహిస్తూపనులు చేయిస్తామంటూ డబ్బులు తీసుకుంటూ పూర్తి చేయిస్తున్నట్టు సమాచారం. భూ సమస్యలకు సంబంధించి ఓ ఇద్దరు వ్యక్తులు ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టరేట్ కార్యాలయాల వరకు తమకు సంబంధాలు ఉన్నాయంటూ ధరణి దందా నడిపిస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

వాస్తవానికి ధరణి రిజిస్ట్రేషన్ కొరకు 200 నుంచి 500 వరకు దరఖాస్తు ఖర్చులు కాగా రిజిస్ట్రేషన్ కొరకు భూమిని బట్టి నగదును ఆన్‌లైన్‌లోనే చెల్లించాల్సి ఉంటుంది. కానీ సదరు వ్యక్తులు టీ స్టాల్, ఇతర ప్రాంతాలలో రెవెన్యూ ధరణి సమస్యలను పరిష్కరిస్తామని ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో తమకు సంబంధాలు ఉన్నాయని బాధితులతో మంతనాలు జరిపి సమస్యను, అవసరాలను గుర్తించి దానికి అనుగుణంగా బాధితుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తూ దందా నిర్వహిస్తున్నట్లు పట్టణ ప్రజలు చర్చించుకుంటు న్నారు. డబ్బుల వసూళ్లలో రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి హస్తముందా ..? సదరు వ్యక్తులే రెవెన్యూ కార్యాలయం పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారా..? అన్నది తెలియాల్సి ఉంది.

రామేశ్వర్‌పల్లి, ర్యాగట్లపల్లి గ్రామాలకు చెందిన బాధితులు సదరు వ్యక్తుల వద్దకు కొంత డబ్బులు చెల్లించి భూ సమస్య పరిష్కరించాలని తెలుపగా సమస్య పరిష్కారం కాకపోవడంతో వ్యక్తులపై గొడవకు దిగినట్టు సమాచారం. అలాగే ఓ ప్రజా ప్రతినిధికి సదరు వ్యక్తుల రెవెన్యూ ధరణి భూ దందాలను తెలుసుకొని సదరు వ్యక్తులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. రెవెన్యూ కార్యాలయం పేరు చెప్పి పట్టణంలో ధరణి దందా జోరుగా సాగుతున్న రెవెన్యూ అధికారులకు తెలిసిన శాంతంగా ఉంటున్నారా..? బయట దందా జరిగితే మాకేం సంబంధం అని తెలిసి తెలియనట్లు వ్యవహరిస్తున్నారా అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ధరణి రిజిస్ట్రేషన్ సమయంలో బ్రోకర్ వ్యక్తులు కార్యాలయంలో ఉండకూడదు కానీ సదరు బ్రోకర్ వ్యక్తులు ధరణి రిజిస్ట్రేషన్ సమయంలో కార్యాలయంలో యదేచ్ఛగా తిరుగుతూ దందా నిర్వహిస్తున్నారు.

ఇటీవల డబ్బులు ఇస్తేనే పనులు చేపడుతున్నారంటూ నాగిరెడ్డిపేట్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పలువురు రైతులు ఆందోళన చేపట్టడంతో కలెక్టర్ ఎమ్మార్వోను సస్పెండ్ చేసిన విషయం విధితమే. ఈ మధ్యకాలంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ధరణిలో భూ సమస్య పరిష్కారం కొరకు 8 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే. రెవెన్యూ కార్యాలయ అధికారుల నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు హస్తం ఉంటేనే రెవెన్యూ ధరణి భూ సమస్యలు పరిష్కారం అవుతాయి. ఎలాంటి సమస్య ఉన్న ధరణిలో పరిష్కరిష్కారం చేయడం భారీ మొత్తంలో బాధితుల నుంచి డబ్బులు వసూలు చేయడం అంటే సదరు బ్రోకర్ వ్యక్తులకు రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు సంబంధాలు పెట్టుకుని దందా నిర్వహిస్తున్నారా అన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఏది ఏమైనప్పటికీ భిక్కనూరు మండలంలో జోరుగా సాగుతున్న ధరణి దందాను రెవెన్యూ, జిల్లా అధికారులు నిఘా ఏర్పాటు చేసి అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకుంటారా..? రెవెన్యూ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు మార్పులు చేస్తున్న రెవెన్యూ సిబ్బందిని గుర్తించి చర్యలు తీసుకుంటారా వేచి చూడాల్సి ఉంది. భూ సమస్య వస్తే చాలు వేల రూపాయల నుండి లక్షల రూపాయల వరకు వసూలు చేసే బ్రోకర్లపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుచున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
ఆదివారం | సెప్టెంబర్ 01, 2024 | www.navatelangana.com

బాలికపై లైంగికదాడికి యత్నం

నవతెలంగాణ-కంఠేశ్వర్



నగరంలో బాలికపై లైంగికదాడియత్నం ఆలస్యంగా వెలుగుచూసింది. రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. రాణా ఏరియాలోని ఓ కాలనీకి చెందిన బాలిక శుక్రవారం మధ్యాహ్నం సమయంలో కిరాణషాపుకు వెళ్లి వస్తుండగా ఓ వ్యక్తి లైంగికదాడికి యత్నించాడు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే నిందితులపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు.

పాఠశాలకు వంట పాత్రలు వితరణ

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు 1990-91 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థి మోహన్ రావు రూ.27వేల విలువగల మధ్యాహ్న భోజన వంట పాత్రలను వితరణ చేశారు. పాఠశాలపై మమకారంతో వంట పాత్రను వితరణ చేసిన మోహన్ రావును పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనాథ్ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజు, ఉపాధ్యాయ బృందం, తదితరులు ఉన్నారు.



వంట పాత్రలు అందజేస్తున్న పూర్వ విద్యార్థి

ప్రశాంత వాతావరణంలో
గణేశ్ ఉత్సవాలు నిర్వహించుకోవాలి



గాంధారి: మాట్లాడుతున్న ఎస్సై ఆంజనేయులు



పెద్దకొడప్‌గల్: మాట్లాడుతున్న ఎస్సై మహేందర్

- **నిబంధనలు పాటించాలి**
- **పలు చోట్ల శాంతికమిటీ సమావేశాల్లో పోలీసుల సూచన**

నవతెలంగాణ-విలేకరులబృందం

ప్రశాంత వాతావరణంలో గణేశ్, దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలని పోలీసులు సూచించారు. నిబంధనల ప్రకారం మండపాలు ఏర్పాటు చేసుకోవాలని వెల్లడించారు. పలు మండలాల్లో శనివారం శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు ఇచ్చారు.

పెద్దకొడప్‌గల్ : మండలంలోని అన్ని గ్రామాల్లోని అధికారులు ప్రజాప్రతినిధులు యూత్ ప్రతినిధులు, గణేష్ మండప నిర్వహకులు శాంతి కమిటీ సమావేశాన్ని స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేందర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో గణేష్ మండపాల కమిటీల సభ్యులు, ప్రతి ఒక్కరూ పర్మిషన్ తీసుకొని ఏర్పాటు చేసుకోవాలని యువకులు అందరూ సహకరించాలని వారితో పాటు స్థానిక నాయకులు యువతతో కొన్ని జాగ్రత్తలు చెప్పాలని అనవసరమైన విషయాలను వెలికి తీయద్దని 9 రోజులపాటు నిష్టతతో గణేష్, పూజలలో పాల్గొని నిమజ్జనం రోజు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని లేనిచో అల్లర్లు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గాంధారి : గాంధారి మండల కేంద్రంలో శనివారం గణేష్ ఉత్సవ శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ గణేష్ మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులకు ఎస్సై పలు సూచనలు చేశారు. గాంధారి మండలంలో శాంతిభద్రతల విఘాతం కలిగిన ప్రవర్తిస్తే చట్టబరమైన చర్యలు తీసుకుంటామని, మంచిగా నిర్వహించేవారికి మేము తోడుగా ఉంటామని ఎవరు ఎవరిని విమర్శించడం, అవమానించడం చేయవద్దని, నిర్వాహకులు నిమజ్జనం సమయంలో గణేష్ విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్లాల్సిందిగా ర్యాలీ వెళ్ళేటప్పుడు తాగి తప్పుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తప్పని సరిగా పర్మిషన్ తీసుకోవాలి, గాంధారికి మంచిపేరు తీసుకురావాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సతీష్ రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్ , ఏ.ఈ. ఎలక్ట్రికల్ సతీష్ రెడ్డి , గాంధారి పంచాయతీ సెక్రెటరీ నాగరాజు మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు వివిధ పార్టీల రాజకీయ నాయకులు గణేష్ మండలి నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి : దేవునిపల్లి ఎస్సై రాజు

కామారెడ్డి : కామారెడ్డి మండలంలోని గ్రామాలలో , మున్సిపల్ పరిధిలో వినాయకుడి మండపాలు ఏర్పాటు చేసేందుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలేని ఒక ప్రకటనలు కోరారు. శనివారం నుండి సెప్టెంబర్ 6 వరకు https://policeportal.tspolice.gov.in/index.htm సైట్లో అప్లై చేసుకోవాలనీ, 2 బాక్స్ ట్రైప్ లౌడ్ స్పీకర్లను మాత్రమే వాడాలి, రాత్రి 10 గం.నుంచి ఉ.6 వరకు వాటిని వినియోగించవద్దనీ, పూర్తి వివరాల కోసం పోలీస్ స్టేషన్ వద్ద నుండి సమాచారం తెలుసుకోవాలని సూచించారు.

పాటించాల్సిన నిబంధనలు

1. పోలీస్ పర్మిషన్ తప్పనిసరి.
2. కరెంట్ కనెక్షన్ కోసం డిడి తీయాలి.. విద్యుత్ అధికారుల పర్మిషన్ తప్పనిసరి.
3. మండపాలతో రోడ్డు మొత్తం బ్లాక్ చేయకుండా, కనీసం టూ వీలర్ వెళ్లేందుకు దారి ఇవ్వాలన్నారు.
4. డిజె లకు అనుమతి లేదు.
5. రాత్రి 10 దాటిన తర్వాత మైక్లు ఆఫ్ చేయాలి.
6. సీసీ కెమెరాలు బిగించుకోవడం మేలు.
7. ఫైర్ సేఫ్టీ కూడా తప్పనీ సరిగా పాటించాలి.
8. పాయింట్ బుక్ ఏర్పాటు చేసుకోవాలి.
9. ఎలాంటి విద్యుత్ షాక్ తగలకుండా ఏర్పాట్లుండాలి
10. వర్షాన్ని దృష్టిలో ఉంచుకొని మండపాలు ఏర్పాటు చేసుకోవాలి.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- **ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు**



ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు తదితర వివరాలు వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఆసుపత్రిలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా. త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రజాప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అందులో భాగంగానే బడ్జెట్‌లో వైద్య ఆరోగ్యానికి అధిక నిధులు కేటాయించిందని తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ రూపొందించి డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ఆనంద్ జాదవ్, ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దేశ సరిహద్దులోని సైనికులు బాగుండాలి

- **మనకోసం మనం ఫౌండేషన్ ఫౌండర్ పట్లోళ్ల కిషోర్**



పాదయాత్ర నిర్వహిస్తున్న పలువురు

నవతెలంగాణ-నిజాంసాగర్

దేశ సరిహద్దులోని సైనికులు, వారి కుటుంబాలు బాగుండాలని మనకోసం మనం ఫౌండేషన్ ఫౌండర్ పట్లోళ్ల కిషోర్ అన్నారు. శనివారం మండలంలోని బ్రాహ్మణపల్లి గేటు వద్ద ఉన్నటువంటి అంజనాద్రి క్షేత్రం నుంచి పిట్లం మండలంలోని రామేశ్వర గుట్ట వరకు పాదయాత్రను నిర్వహించారు. పాదయాత్రకు వివిధ గ్రామాల ప్రజలు భారీగా హాజరై వర్షంలోనే పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పది సంవత్సరాల నుంచి శ్రావణమాసం చివరి శనివారం రోజు పాదయాత్రను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం పాదయాత్ర ముఖ్య ఉద్దేశం మన ఊరు బాగుండాలని, మన ప్రాంతం బాగుండాలని, మన దేశం బాగుండాలని ప్రతిక్షణం మన దేశాన్ని రక్షిస్తున్న దేశ సైనికులు బాగుండాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

ఆలయంలో వైద్య సేవలు

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణ కేంద్రంలో ఉన్న దక్షిణ కాశి శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయంలో శ్రావణమాసం ఆఖరి శనివారం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు యేమిమా ఆలయ ప్రాంగణంలో వైద్య సేవలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఈఓ వెంకటరమణ ఆలయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అందుబాటులో అనారోగ్యాన్ని గురైన భక్తులకు వైద్య సేవలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీధర్, వైద్య సిబ్బంది సతీష్, ఆశా వర్కర్లు, తదితరులు ఉన్నారు.

పోసానిపేట తపాల ఆఫీసులో తనిఖీలు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని పోసానిపేట తపాలా ఆఫీసులో అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. పోసానిపేట్ పోస్ట్ మెన్ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయగా, పోస్ట్ ఆఫీస్ డబ్బులు గల్లంతయ్యాయని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. విచారణలో డబ్బులు గల్లంతైనట్లు నిర్ధారణ జరిగితే, ఖాతాదారులకు న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

పోలింగ్ స్టేషన్ పరిశీలించిన ఎంపీడీవో

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని అంతంపల్లి, లక్ష్మీ దేవునిపల్లి, కాచాపూర్, పెద్ద మల్లారెడ్డి, అయ్యవారిపల్లి గ్రామాలలోని పోలింగ్ స్టేషన్లను ఎంపీడీవో రాజ్ కిరణ్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రానున్న సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ స్టేషన్‌లలో వీల్ చైర్స్, విద్యుత్ సౌకర్యం, సరిపడా ఫర్నిచర్ సౌకర్యాలను పరిశీలించారు. ఎన్నికలకు పోలింగ్ స్టేషన్‌లు సమస్యలు లేకుండా సిద్ధంగా ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మౌనిక, సుమలత, లక్ష్మి, పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

సీఎం సహాయనిధి చెక్కులను ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొల్లపల్లి లక్ష్మా గౌడ్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల లబ్దిదారులకు శనివారం అందజేశారు. మండల గ్రామాలలోని 28 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి, నాయకులు రంజిత్, నామాల రవి, వడ్ల లక్ష్మి రాజ్యం, అంబాయి ప్రసాద్, బి పేట నర్సింలు, బిట్ల నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాఫిర్యాదులు పరిష్కరించండి

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి ప్రజల సమస్యల పరిష్కారం కోసం గ్రామ గ్రామాన ఏర్పాటుచేసిన ఫిర్యాదుల బాక్స్‌లో వచ్చిన ఫిర్యాదులు, రెవెన్యూ, రేషన్ సంబంధించిన సమస్యలను రెవిన్యూ అధికారులు పరిష్కరించాలని, శనివారం రమణారెడ్డి ఆదేశాల మేరకు బిజెపి నాయకులు మండల కేంద్రంలోని తహసీల్దార్ సువర్ణకు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో మున్సిపల్ 42వ కౌన్సిలర్ పండ్ల ప్రవీణ్, మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, పిప్పిరి నరేష్, ముత్యాల రాజు, రంజిత్ రాథోడ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురుపై కేసు నమోదు

నవతెలంగాణ-భిక్కనూర్

మద్యం సేవించి వాహనం నడుపుతున్న మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై సాయి కుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి వాహనాల తనిఖీలలో భాగంగా మద్యం సేవించి వాహనం నడుపుతున్న వారిని డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేసినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపితే కేసు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందని హెచ్చరించారు.

నల్లబ్యాడ్జీలతో ఆరోగ్యశ్రీ ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-కామారెడ్డి



నిరసన చేస్తున్న ఉద్యోగులు

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమ్మెలో భాగంగా శనివారం 11వ రోజు నల్ల బ్యాడ్జీలు ధరించి కామారెడ్డి ప్రభుత్వం జనరల్ ఆస్పత్రి ముందు ఆరోగ్యశ్రీ మిత్రాలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అల్లావుద్దీన్ మాట్లాడుతూ సమ్మె నోటీస్ ఇచ్చి 20 రోజులు గడిచిపోయినప్పటికీ ఇప్పటివరకు సమస్యలను పరిష్కారం చేయకుండా కాలయాపన చేస్తూ అధికారులు, ప్రభుత్వం నిమ్మకు నీరుతున్నట్టు వ్యవహ రించడం బాధాకరమన్నారు. తక్షణమే తమ సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ఈ సోమవారం 2వ తేదీ నుండి విధులను బహిష్కరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టంచేశారు. తక్షణమే న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించి ప్రభుత్వం ఉదరతను చాటుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా వివిధ హాస్పిటల్ లో 25 మంది ఆరోగ్యశ్రీ మిత్రలు ఈ నిరసనలలో పాల్గొన్నారు. జిల్లా ఆస్పత్రిలో నిర్వహించినటువంటి ఈ నిరసన కార్యక్రమంలో ఆరోగ్య మిత్రాలు గంగాధర్, అంజయ్య, మహేష్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు వైద్య ఆరోగ్య శిబిరం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని మెంగారం గ్రామంలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో గత రెండు రోజుల క్రితం డెంగ్యూ జ్వరంతో యువకుడు మృతి చెందడంతో గ్రామంలో ఇంటింటికి వెళ్లి రెండో రోజు జ్వరం సర్వే లారా సర్వే నిర్వహిస్తున్నారు. రెండో రోజు 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా నలుగురి నమూనాలను పరీక్షించగా నెగిటివ్ వచ్చిందన్నారు. అనంతరం పైరే త్రిమ్ దోమల నివారణ మందుల పిచికారి చేశారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో శుభ్రంగా ఉంచుకోవాలని వ్యాధులు ప్రభలకొండ జాగ్రత్తలు పడాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి హిమబిందు జిల్లా వైద్య సిబ్బంది ఠాగూర్ రామ్ రెడ్డి సూపర్వైజర్లు ఫరీదా యాద్గిరి లక్ష్మణ్, రాజమణి ఆశ వర్కర్లు

జిల్లాలో 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని (సెప్టెంబర్ 1వ తేది నుండి 07 వ తేదీ వరకు) జిల్లా కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తం గా 30,30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని కామారెడ్డి జిల్లా ఎస్.పి. సిహెచ్.సింధు శర్మా ఐ.పి.ఎస్ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. అలాగే ప్రజా ధనాన్ని నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్.పి. హెచ్చరించారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తమకు ఈ విషయంలో సహకరించాలన్నారు.

డాటాబేస్ సమాచారంతో
ట్రాన్స్‌ఫార్మర్‌లలో లోపాలు సరిచేయాలి

- **జిల్లా విద్యుత్ శాఖ అధికారి రమేష్**



మాట్లాడుతున్న జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎం. రమేష్

నవతెలంగాణ - కామారెడ్డి

కామారెడ్డి జిల్లా విద్యుత్ అధికారులతో జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎం రమేష్ బాబు విద్యుత్ సరఫరా పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. డాటా బేస్ సమాచారంతో ఏ లొకేషన్‌లో అయితే ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్ అయ్యే అవకాశం ఉందే వాటిని తనిఖీ చేసి లోపాలను సవరించాలని, మరల ఫెయిల్ కాకుండా సత్వర చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటి వరకే చేపట్టిన యూనిక్ పోల్ నంబరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలనీ, మొబైల్ యాప్‌లో వివరాలను నమోదు చేయాలనీ అన్నారు. ఎవరైతే కేబుల్ , బ్రాడ్ బ్యాండ్ ఆపరేటర్లు తమ కేబుల్‌లను విద్యుత్ స్తంభాలపై వేసుకుంటున్నారో వాటిని ఒక క్రమబద్ధ పద్ధతిలో సరిచేసుకొని బ్రేక్ డౌన్ పునరుద్ధరించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూసుకోవాలని, ఈ కేబుల్ వైర్లు అస్తవ్యస్తంగా ఉండటం వలన వినియోగదారులు విద్యుత్ వైర్లకు కేబుల్ వైర్లకు తేడా తెలువక భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు.

కేబుల్, బ్రాడ్ బ్యాండ్ ఆపరేటర్లు వినియోగించే వైర్లను ఒక క్రమపద్ధతిలో సరిచేసుకోవాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం పోల్ రెంటల్ చార్జీలను వసూలు చేయాలన్నారు. వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన పంపుసెట్లకు విద్యుత్ ఇవ్వడానికి అంచనాలు, వర్క్ ఆర్డర్లను త్వరగా మంజూరు చేసి 30-45 రోజుల వ్యవధిలో కొత్త వ్యవసాయ కనెక్షన్లను మంజూరు చేయాలనీ, పంట కోతల తర్వాత, యాసంగి సీజన్ మధ్య కాలంలో పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ కనెక్షన్లన్నీ మంజూరు చేయాలనీ అన్నారు. వినియోగదారుల బిల్లింగ్ ప్రక్రియ ఐ ఆర్ డి ఏ పద్ధతిలో గాని , ఓ సి ఆర్ పద్ధతిలో గాని, చేసి వీలైనంత వరకు మాన్యువల్ బిల్లింగ్‌ను తగ్గించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17వ తేదీ నుండి నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో ఎవరైతే అర్హత ఉండి , గృహ జ్యోతి లబ్ది పొందని వినియోగదారులు ప్రజా పాలన కార్యక్రమంలో తమ దరఖాస్తులను ఇచ్చే విధంగా వారికి అవగాహన కలిపించాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ మీటర్లు లేని వినియోగదారులు ఉన్నట్లైతే అట్టి బిపిఎల్ వినియోగదారులు 500 వాట్ల కంటే వారి యొక్క లోడ్ తక్కువ ఉన్నట్లయితే 500 కిలో వాట్ల వరకు తగిన చార్జీలు చెల్లించి కొత్త కనెక్షన్ పొందడానికి అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఈ సమావేశంలో ఆదేశించారు.

ఓటర్ జాబితా పకడ్బందీగా సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-దోమకొండ

గ్రామ పంచాయతీల ఓటర్ లిస్ట్ ను అధికారులు, పంచాయతీ కార్యదర్శులు బిఎఓలు పకడ్బందీగా సిద్ధం చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. దోమకొండ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ లో జరుగుతున్న ఓటరు జాబితా, ఎల్‌ఆర్‌ఎస్ పక్రియను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఓటరు లిస్ట్ పక్రియను బీయల్‌వోలు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల ఓటరు లిస్ట్‌ను ఒకే పోలింగ్ బూతు లో నమోదు చేసి, ఓటరు జాబితాను త్వరగా పూర్తి చేయాలనీ అధికారులకు సూచించారు. గ్రామాలలోని ఎల్ ఆర్ ఎస్ పక్రియ దరఖాస్తు లను పొజిషన్ వద్ద విచారణ చేయాలనీ, ప్రభుత్వ స్థలం, శిఖం, ఎండోమెంట్ స్థలలో ఉన్న దరఖాస్తు లను తిరస్కరణ చేయాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, డీయల్పీవో శ్రీనివాస్,ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు రమేష్, అంజయ్య, స్నేహ, సౌందర్య, వసంత, పద్మ బిఎల్ఓలు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో అన్నదానం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని కొండాపూర్ గ్రామంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణమాసం చివరి శనివారం కావడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బానోత్ నరేష్ నాయక్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు భగవద్గీతను పంచుతూ భక్తిశ్రద్ధలతో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికంగా ఉంటూ సేవలో ముందుండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో. కుమ్మరి రవి గంగా గౌడ్. బెస్త కాశీరాం సిద్ధు. పంతులు. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

- **మెడికల్ ఆఫీసర్ సుజన్ కుమార్**



తనిఖీ నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్ సుజన్ కుమార్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ప్రథమ చికిత్స కేంద్రాలలో కేవలం ప్రథమ చికిత్స వైద్యం మాత్రమే అందించాలని మెడికల్ ఆఫీసర్ సుజన్ కుమార్ స్పష్టం చేశారు. శనివారం మండల కేంద్రంలో గల పిఎంపి ఆర్.ఎం.పి దవాఖానాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్లినిక్‌కు అత్యధిక డోసులు ఇచ్చే ఇంజక్షన్స్ వాడకూడదని డెంగ్యూ టెస్ట్ అసలు చేయకూడదని సూచించారు. నిబంధనలన అతిక్రమించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రభాకర్ చారి, పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య ఉన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి పలువురు కౌన్సిలర్లు చేరిక

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

బిఆర్ఎస్ పార్టీని వీడి 5 మంది ఎల్లారెడ్డి పురపాలక సంఘ కౌన్సిలర్లు స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు సమక్షంలో శనివారం హైదరాబాదులోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.మున్సిపల్ అభివృద్ధి లక్ష్యంగా పార్టీ మారినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో 1వ వార్డు కౌన్సిలర్ అల్లం శ్రీను, 6వ వార్డు కౌన్సిలర్ సంగని బాలమణి పోచయ్య, 8వ వార్డ్ కౌన్సిలర్ భూదేవి,10వ వార్డ్ కౌన్సిలర్ పద్మ శ్రీకాంత్, 12 వార్డ్ కౌన్సిలర్ నీలకంఠం ఉన్నారు. వీరికి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా కాంగ్రెస్ నాయకులు గోపికృష్ణ, తిరుపతి,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
4
ఆదివారం | సెప్టెంబర్ 01, 2024 | www.navatelangana.com

కవి ప్రేమ్‌లాల్‌కు సన్మానం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సామాజిక సేవా సంస్థ ద్వారా అనేక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న తెలుగు కవి ప్రేమ్ లాల్‌కు స్వరంజలి సంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షులు వేంపల్లి వేముల శేఖర్, నగరంలోని సీతారాంనగర్ కాలనీలోని స్వరాంజలి సంస్థ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ.. సమాజానికి మంచి కార్యక్రమం నిర్వహించడానికి ముందుంటూ చురుకుగా పాల్గొంటున్నారని అన్నారు. అందుకు ప్రేమ్‌లాల్‌ను ఘనంగా సన్మానించినట్టు వివరించారు.


ప్రేమ్‌లాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కాలకృత్యాలకు వెళ్లి చెరువులో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-మోపాల్

కాలకృత్యాలకు వెళ్లి చెరువులో పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామ శివారులో శనివారం చోటుచేసుకుంది. డిచ్‌పల్లి మండలం గన్‌పూర్ గ్రామానికి చెందిన మారుతి(32) తన బంధువుల పెళ్లికి వచ్చాడు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి చెరువు వద్దకు వెళ్లిన ఆయన.. ప్రమాదవశాత్తు జారి చెరువులో పడి మృతిచెందాడు. మృతుడి భార్య సంగీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని తన బంధువులకు అప్పగించినట్టు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు.


మృతిచెందిన మారుతి

వ్యర్థాలు తొలగింపు

- 'కాలువకు దారేది' కథనానికి స్పందన

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని పాత జాతీయ రహదారి సమీపంలోని కాలువలో గత కొన్ని రోజులుగా నీరు వ్యర్థాలతో నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో మండల పంచాయతీ అధికారి గంగామోహన్ శుక్రవారం గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులతో కాలువలోని అడ్డుకట్టలను తొలగించి నీరు పారే విధంగా చర్యలు తీసుకున్నారు. మురుగునీరు నిలువతో దోమలు విజృంభిస్తున్నాయని ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా స్థానికులు భయాందోళనకు గురవుతుండటంతో సమస్య పరిష్కరించాలని నవతెలంగాణ దినపత్రికలో ఆగస్టు 17న "కాలువకు దారేది" అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. కథనానికి ఎట్టకేలకు స్పందించిన అధికారులు సమస్యను పరిష్కరించారు. మండల పంచాయతీ అధికారి గంగా మోహన్ శుక్రవారం గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులతో కాలువలోని అడ్డుకట్టలను తొలగింపజేశారు. నీరు పారకుండా కొందరు కాలువలకు అక్కడక్కడ అడ్డుకట్టలు వేశారని, పంచాయతీ పారిశుధ్య కార్మికుల సహాయంతో అడ్డుకట్టలను పూర్తిగా తొలగించామని తెలిపారు. కాలువలోని మురికినీరు తొలగిపోవడానికి కొంత సమయం పడుతుందని ఆయన తెలిపారు.


అడ్డుకట్ట తొలగిస్తున్న సిబ్బంది

సాగునీటిని వృథా చేయొద్దు

- బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి
- పలు గ్రామాల్లో సాగునీటి కాల్వలు పరిశీలన

నవతెలంగాణ-రెంజల్

సాగునీటిని వృథా చేయొద్దని బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా వానకాలం పంటకు సాగునీటి అందించే ఉద్దేశంతో శుక్రవారం నీటిని వదలగా, అలీసాగర్ ఎత్తిపోతల పథకం ఆయకట్టు కింద ఉన్న రెంజల్ మండలం సాగునీటి కాలువలను ఆయన పరిశీలించారు. సాగునీటిని వృథా చేయకుండా తమ పంటలకు వాడుకోవాలని ఆయన సూచించారు. మండలంలోని దండిగుట్ట, రెంజల్, సాటాపూర్, తాడ్‌బిలోలి గ్రామాల్లోని సాగునీటి కాలువలను పరిశీలించి సంబంధిత ఆయా శాఖల అధికారులతో చర్చించారు. అధికారులు కాలువలను మరమ్మతులు చేసి ఆయకట్టు కింద రైతులకు సాగునీటి అందించాలని ఆయన ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులతో పాటు ప్రజలు తమ సహాయ సహకారాలు అందించాలని, వర్షాకాలంలో చుట్టుపక్కల ఉన్న గుంతలలో నెలకొన్న మురికి నీటిలో దోమలు చేరే అవకాశం ఉందిన ఆయిల్‌బాల్స్‌ను వాడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే దోమకాటును నివారించుకోవచ్చని ఆయన సూచించారు. కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో వంటలను పరిశీలించిన ఆయన బాలికలకు పౌష్టికాహారాన్ని అందించడానికి వంటలు తయారు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నేడు విద్యావ్యవస్థను మెరుగుపరచడానికి అనేక కార్యక్రమాలను చేపట్టిందని, 75 శాతం విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో బోధించాలని ఆయన సూచించారు. రెంజల్ మండలం తాడ్‌బిలోలి శ్మశాన వాటికకు దారిలేదని ప్రజలు ఆయన దృష్టికి తీసుకురాగా త్వరలో మనమత్తులు జరిపిస్తానని హామీనిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్యంపైనే ప్రత్యేక దృష్టిని సారించిందని, అలాగే రైతుల రుణమాఫీపై ప్రతి ఒక్క రైతు రుణమాఫీ అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబీన్ ఖాన్, మాజీ అధ్యక్షులు సాయిరెడ్డి, కిసాన్ సెల్ మండలాధ్యక్షులు సురేందర్‌గౌడ్, జియాసోదీన్, వడ్డెక్క మోహన్, లచ్చేవారి నితీన్, సాయిబాబాగౌడ్, కురుమే శ్రీనివాస్, పుర్ఖాన్, రఘు, నరసయ్య, సిద్ధ సాయిలు, రాకేష్, శంషుద్దీన్, ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్, రెంజల్ ఎస్ఐ ఈ.సాయన్న, నీటిపారుదల శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

హున్సా హైస్కూల్‌కు ఉపాధ్యాయులను కేటాయించాలి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం హున్సా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్నందున విద్యార్థుల సౌకర్యార్థం ఉపాధ్యాయులను తక్షణమే కేటాయించాలని గ్రామస్థులు శనివారం బోధన్ ఎంఈఓ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రాన్ని అందించారు. అలాగే జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలను విడిగా ఏర్పాటు చేయాలని కోరారు. డీఈవో, ఎంఇఓ సానుకూలంగా స్పందించి త్వరలోనే ఉపాధ్యాయులని డిప్యూటేషన్ పంపుతామని తెలిపారు. ఉపాధ్యాయులను కేటాయించని యెడల భవిష్యత్తులో ఎంఈఓ ఆఫీసుని విద్యార్థుల తల్లిదండ్రులతో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చీల శంకర్, ఈరాయప్ప మహారాజ్, శమీ, శంకర్, షికారి నారాయణ, వల్లికొండ నాని, మరిగే శివకుమార్, ప్రకాష్, శివ, హున్నాయప్ప తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ కామర్స్ విభాగంలో పాతులోత్ భీకోజీకి డాక్టరేట్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ కామర్స్ విభాగం పరిశోధక విద్యార్థి పాతులోత్ భీకోజీకు డాక్టర్ ప్రొఫెసర్ రాంబాబు గోపిశెట్టి పర్యవేక్షణలో కస్టమర్స్ పర్సెప్షన్ టు వర్డ్స్ ఈ బ్యాంకింగ్ సర్వీసెస్ ఏ కంపారిటివ్ స్టడీ ఆఫ్ పబ్లిక్ అండ్ ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్స్ అనే అంశంపై పరిశోధన జరిపారు. శనివారం జరిగిన బహిరంగ మౌఖిక పరీక్షకు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్ ప్రొఫెసర్ జే.రవికుమార్ ఉస్మానియా యూనివర్సిటీ హాజరై పరిశోధన సిద్ధాంత గ్రంథంపై విస్తృతమైన, విఫలమైన సమగ్రమైన ప్రశ్నలు లేవనెత్తారు. ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్ అడిగిన అన్ని ప్రశ్నలకు పరిశోధక విద్యార్థి సాపేక్షమైన ఉదాహరణలతో సమాధానాలు ఇవ్వడంతో ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్ పరిశోధన గ్రంథం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానంగా ఈ పరిశోధనలో బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మకంగా వచ్చిన డిజిటలైజేషన్, ఆన్లైన్ వలన కలిగిన ప్రయోజనాలు పబ్లిక్ రంగబ్యాంకుతో పాటు ప్రైవేట్ రంగంలో కొనసాగుతున్న బ్యాంకుల సామర్థ్యాన్ని అధ్యయనం చేశారు. డిజిటలైజేషన్ ఆన్లైన్ వలన వినియోగదారునికి కలిగే ప్రయోజనాలను సమగ్రంగా అధ్యయనం చేసి ఆన్లైన్ వల్ల ఉన్న బహుళ ప్రయోజనాలను గుర్తించారు. పరిశోధక విద్యార్థి పాతులోతు బికోజి అందించిన జవాబులకు బహిరంగ మౌఖిక పరీక్షకు హాజరైన ఆచార్య జే.రవికుమార్ సంతృప్తి వ్యక్తం చేసి పీహెచ్డీ డిగ్రీ ప్రధానానికి ఆమోదం తెలిపారు. తన పరిశోధనకు సహకరించిన తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యం.యాదగిరికి ఎంతో రుణపడి ఉన్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గంగాధర్, డాక్టర్ జి.శ్రీనివాస్, డాక్టర్ శ్వేత, డాక్టర్ కిరణ్ రాథోడ్, ప్రోగ్రామర్ రాజు పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.


డాక్టరేట్ అందుకుంటున్న బికోజీ

మూడో విడత రుణమాఫీ చెక్కులు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కొలిప్యాక్ సొసైటీ పరిధిలో నాలుగు గ్రామాల 27మంది రైతులకు 3వ విడుత రుణమాఫీ చెక్కులను సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, సీఎం రేవంత్ రెడ్డికి సొసైటీ చైర్మన్, రైతులు కతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా పనిచేయాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- క్షేత్రస్థాయి అధికారులతో వీ.సీ ద్వారా సమీక్ష

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సీజనల్ వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి కలెక్టర్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీల కార్యదర్శులతో సమీక్ష జరిపారు. జిల్లాలో ఎక్కడ కూడా డెంగీ, చికున్ గున్యా, మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాలు వంటి వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా డెంగీ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. పారిశుధ్య పనులు పక్కాగా జరిగేలా నిరంతరం పర్యవేక్షణ చేయాలని, దోమల నివారణకు అన్ని నివాస ప్రాంతాలలో ఫాగింగ్ చేయించాలని, నిలువ నీరు ఉన్న చోట, మురుగు కాలువలలో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. రోజువారీగా పీ.హెచ్.సీల నుండి సీజనల్ వ్యాధులకు సంబంధించిన కేసుల నమోదు వివరాలను తెప్పించుకుని, ఎక్కడైనా డెంగీ కేసులు నమోదైతే చుట్టుపక్కల అన్ని నివాస గృహాల వద్ద నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బైటెక్స్, టేమీఫోస్, ఫైరిత్రాన్, మెలాథీన్ మందులను అన్ని గ్రామపంచాయతీలలో అందుబాటులో ఉంచుకోవాలని, వారానికి కనీసం రెండు పర్యాయాలు తప్పనిసరిగా పిచికారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రానున్న రోజులలో సీజనల్ వ్యాధులు మరింతగా ప్రబలేందుకు ఆస్కారం ఉన్నందున, అక్టోబర్ నెలాఖరు వరకు అప్రమత్తతో కూడిన చర్యలు చేపట్టాలని హితవు పలికారు. ఎక్కడ కూడా తాగునీరు కలుషితం కాకుండా నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.


వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్

బాధిత కుటుంబానికి పరామర్శ


దగ్ధమైన ఇల్లును పరిశీలిస్తున్న బీఎస్పీ నాయకులు

నవతెలంగాణ-బోధన్

సాలూర సాయినగర్ కాలనీలో శుక్రవారం గ్యాస్ సిలిండర్ లీక్ అయి ఇల్లు దగ్ధమైన ఘటనలో సర్వస్వం కోల్పోయిన బాధితుల కుటుంబాన్ని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు సింగడి పాండు శనివారం పరామర్శించారు. ఘటనకు గల కారణాలను స్థానికులను, బాధితురాలు ఆనందబాయిని అడిగి తెలుసుకున్నారు. గ్యాస్ లీక్ కావడం వలన మంటలు చెలరేగి బాధితులు సర్వం కోల్పోయి సుమారు 3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని ఆయన అన్నారు. కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి నిరుపేద బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని, వారికి డబుల్ బెడ్ రూం కేటాయించి, నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కనీసం తినడానికి సరుకులు లేక, ధరించడానికి దుస్తులు, ఉండడానికి ఇల్లులేక బాధితులు ఇబ్బందులు పడుతున్నారని వారిని అధికారులు వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

నేడు నిరసనను విజయవంతం చేద్దాం

- ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నేడు నిరసనను విజయవంతం చేద్దామని ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా చైర్మన్ అలుక కిషన్ అధ్యక్షతన శనివారం టీఎన్జీవోఎస్ భవన్‌లో సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఉద్యోగ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సిపిఎస్ రద్దు అంశంతో పాటు వివిధ ఇతర ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లపై నిరసన కార్యక్రమాలను నిర్వహించడానికి సన్నాక సమావేశాన్ని నిర్వహించారు. ఎంప్లాయిస్ జేఏసీ సన్నాహక సమావేశంలో టీఎన్జీవోఎస్, టీజీవో, టిజిఆర్ఈఎస్ఏ, పిఆర్‌టియు, టీఎస్ యుటిఎఫ్, డిటిఎఫ్, పెన్షనర్స్, క్లాస్‌ఫోర్, కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్, టిపిటిఎఫ్, రిటైర్డ్ ఎంప్లాయిస్, వివిధ యూనియన్ల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తామంతా ఐక్యంగా ఉన్నామని తెలుపుతూ నేడు పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయుటకు ప్రతి సిపిఎస్ ఉద్యోగితో పాటు ఓపిఎస్ ఉద్యోగులందరూ అధిక సంఖ్యలో హాజరై, నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నిరసన గళం గట్టిగా చేరవేసి, హక్కుల సాధన కొరకు పాటుపడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అన్ని ఉద్యోగ సంఘాల ఉద్యోగులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న జేఏసీ ప్రతినిధులు

సీనియర్ జర్నలిస్టు సత్యనారాయణ మృతి

- అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రెస్‌క్లబ్ సభ్యులు, నాయకులు


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం జాడీజమాల్‌పూర్ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు యాపారు సత్యనారాయణ (60) శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న బోధన్ ప్రెస్‌క్లబ్ సభ్యులు శనివారం జరిగిన అంత్యక్రియలలో పాల్గొని సత్యనారాయణ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. సత్యనారాయణ పలు ప్రముఖ దినపత్రికలలో గత కొన్ని సంవత్సరాల నుంచి పనిచేశారు. సీనియర్ జర్నలిస్టుగా ఉన్న సత్యనారాయణ అంత్యక్రియలలో డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, బీఆర్ఎస్ సాలూర మండల అధ్యక్షులు నర్సయ్య, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు పాండు, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు వాసు, గంగులు, లింబూరి లక్ష్మణ్, సాయిలు, రాజేష్, మల్లన్న పాల్గొన్నారు.

మెగా హెల్త్‌క్యాంప్‌ను ప్రారంభించిన రూరల్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బోర్గాం (పి) గ్రామంలో శనివారం మనోరమ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని తమ ఆరోగ్యం విషయంలో కొంచెం కూడా నిర్లక్ష్యం చేయకుండా చుట్టుపక్కల ప్రాంతాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇటువంటి సమయంలో మనోరమ హాస్పిటల్ వారు ఇంత మంచి హెల్త్ క్యాంప్ నిర్వహించడం చాలా అభినందనీయమని తెలిపారు. ముఖ్యంగా ఆడవారు బ్రెస్ట్ క్యాన్సర్ సంబంధించిన వాటితో అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా తొలి దశలోనే దానికి నియంత్రణ ఉంటుందని తెలిపారు. మితిమీరినప్పుడు ప్రాణాపాయం పొందే విధంగా ఉంటుందని కచ్చితంగా సరైన టీకాలను, డాక్టర్ సూచనలను పాటించాలని ఆయన కోరారు. ఈ హెల్త్ క్యాంపునకు తోడ్పాటు అందించిన డాక్టర్ కట్టా నరసింహను ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బోర్గాం సొసైటీ చైర్మన్ ఎన్‌డిసిసిబి డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఫిషరీస్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, చామకూర అనిల్ రెడ్డి, ఎన్‌డిసిసి బ్యాంక్ డైరెక్టర్ గోరుకంటి లింగన్న, మాజీ ఎంపిటిసి రఘు పటేల్ తదితరులు పాల్గొన్నారు.



హెల్త్‌క్యాంపులో పాల్గొన్న ఎమ్మెల్యే

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ అన్నారు. శనివారం మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్వసభ్య సమావేశంలో 26 ఎజెండా అంశాలు, అదనంగా మరో 11 ఎజెండా అంశాలు ఆమోదించినట్టు తెలిపారు. తాగునీటి కోసం ప్రత్యేక నిధులు కేటాయించినట్లు తెలిపారు. అలాగే కౌన్సిలర్ మీర్ నజీర్ ఆలీ మాట్లాడుతూ.. ప్రజాపాలన కార్యక్రమంపై అధికారులు తప్పనిసరిగా కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ ప్రజల చేతిలో దేహశుద్ధి అయిన కౌన్సిలర్లను సస్పెండ్ చేస్తూ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. మరో కౌన్సిలర్ మాట్లాడుతూ.. పట్టణంలో తాగునీటి సరఫరాలో సమయ పాలన పాటించకపోవడం వలన ఇబ్బందులు తలెత్తున్నాయని, కావున సిబ్బంది సక్రమంగా సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

సొంత ఖర్చుతో జాతీయ రహదారిపై గుంతల పూడ్చివేత

- అభినందించిన గ్రామస్తులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని 63వ నంబర్ జాతీయ రహదారిపై ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏర్పడ్డ గుంతలను గ్రామానికి చెందిన సురంగి చంద్రశేఖర్ (సైకిల్ టెక్సి) శనివారం తన సొంత ఖర్చులతో పూడ్చి వేయించారు. జాతీయ రహదారిపై బస్టాండ్ సమీపంలో, నాగపూర్ చౌరస్తా వద్ద, మెట్‌పల్లి దారిలో పెట్రోల్ పంపు వద్ద ఏర్పడ్డ పెద్ద పెద్ద గుంతలను సిమెంట్ కాంక్రీట్ ఇసుకతో మిక్స్ చేసిన మిశ్రమాన్ని గుంతల్లో వేసి పూడ్చి వేయించారు. జాతీయ రహదారిపై ఏర్పడ్డ గుంతలతో రాత్రి వేళల్లో ప్రయాణం సాగించే పలువురు వాహనదారులు ఇటీవల ప్రమాదాలకు గురైన నేపథ్యంలో స్పందించిన సురంగి చంద్రశేఖర్ తన సొంత ఖర్చుతో ఆ గుంతల్ని పూడిపించారు. గ్రామంలోని జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడి ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్న తరుణంలో సురంగి చంద్రశేఖర్ తన సొంత ఖర్చులతో ఈ గుంతలను గుర్తించి పూడ్చి వేయడం పట్ల గ్రామస్తులు అభినందించి, హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ మిత్రులు పెంట కిషన్, బాలకృష్ణ, సుంకేట శ్రీనివాస్, భోగ శ్యామ్, సుజుకి ధరి, రాజేశ్వర్, వేములవాడ జగదీష్, ఎనేడ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


గుంతలను పూడ్చివేస్తున్న దృశ్యం

సమగ్ర విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని హాస్టల్లో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్యపైన సమగ్ర విచారణ చేపట్టాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని నీలం రామచంద్రయ్య భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడుతూ.. రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ చదువుతున్న విద్యార్థిని తన హాస్టల్లోని బాత్రూంలో ఉరి వేసుకోవడం బాధాకరమన్నారు. హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపాల్‌ను, కళాశాల అధికారులను వెంటనే విచారణ చేయాలని డిమాండ్ చేశారు. దోషులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని తెలిపారు. విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నసిర్, సృజన్, శివ కుమార్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

లిల్లీపుట్ పాఠశాలలో ఫ్లవర్స్ డే సంబరాలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు ఫ్లవర్స్ డే సెలబ్రేషన్ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరూ వివిధ రకాల పువ్వులతో తరగతి గదిని అలంకరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ పువ్వుల ప్రత్యేకతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దాసు, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



ఫ్లవర్స్ డేలో పాల్గొన్న విద్యార్థులు

సొసైటీ అభివృద్ధికి ఎంతగానో కృషి

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గత 15 సంవత్సరాలుగా సహకార సంఘం కార్యదర్శిగా పనిచేసిన మోహన్ రెడ్డి పదవి విరమణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘం అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా సొసైటీని ఎంతో బలోపేతం చేసి సొసైటీ అభివృద్ధికి కృషి చేశారని ఆయన సేవలు కొనియాడారు. కార్యదర్శి దంపతులను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఉదల్ సింగ్ ., మాజీ చైర్మన్ ముకుంద్ రావు , డైరెక్టర్లు అశోక్ రెడ్డి , తడ్వాయి సంతోష్ , గాండ్ల లక్ష్మణ్ , సాయిలు , గణపతి , శివాజీ , హార్జయా , జనార్దన్ , పోసయ్య, రాథోడ్ నెహ్రూ ప్రజాప్రతినిధులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన పలువురు

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రుణమాఫీ మాఫీ చేశారా..?

- బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో వెనక్కు నెట్టింది..
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

దేశంలోని బిజెపి పాలిత రాష్ట్రాల్లో రైతులకు ఒక్క రూపాయి అయినా మాఫీ చేయకుండా తెలంగాణలో మాఫీ చేసిన తమపై విమర్శలు గుప్పించడం అవివేకమని, బిజెపి పార్టీ ఎజెండా లేని పార్టీ అని, కులమతాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడమే వారి ధ్యేయమని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి అన్నారు. ప్రతిపక్షాల మాటలకు రైతులు మోసపోవద్దని సూచించారు. శనివారం డిచ్‌పల్లి మండలంలోని నడ్పల్లి, ధర్మారం బీ, బర్దిపూర్, మేంట్రా జ్‌పల్లి గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకు స్థాపన చేశారు. ధర్మారం బీ లో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజల ప్రభుత్వమని ప్రజా పాలనలో ఏ ఒక్క వర్గానికి అన్యాయం జరగకుండా అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం పాటిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లపాటు రాష్ట్రాన్ని అన్ని విధాల వెనక్కు నెట్టారని కమీషన్ల కోసం కక్కుర్తి పడి ఏడు లక్షల కోట్ల అప్పులు మిగిల్చారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హాయంలో ఒక లక్ష రూపాయలు రుణమాఫీ చేయడానికి నాలుగు విడతలు అందజేసిన అవి వడ్డీలకే సరిపోయాయని, కాని కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ ప్రతి రైతుకు ఇచ్చి తీరుతామని, రానివారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మండలంలోని నడిపల్లి, ధర్మారం బీ, బర్దిపూర్ గ్రామాలలో సామాజిక ఆరోగ్య ఉపకేంద్రం నూతన భవనాలు నిర్మాణం కొరకు రూ.60 లక్షలతో పంచాయతీరాజ్ శాఖ 15వ ఫైనాన్స్ నిధులు, మెంట్రాజ్‌పల్లిలో 5 లక్షలతో పద్మశాలి భవనం నిర్మాణం చేపడతామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి 6 గ్యారంటీలను అమలు చేస్తున్నామని అన్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని మాట ఇచ్చి మడమ తిప్పని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు. ఆరు గ్యారెంటీలో భాగంగా రైతు రుణమాఫీ, ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత విద్యుత్తు, గృహ లక్ష్మి, ఆరోగ్య శ్రీ లో 10లక్షల వరకు ఉచిత వైద్యం అందజేస్తున్నామన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఇప్పటికే 20 సబ్ సెంటర్ల నిర్మాణానికి నాలుగు కోట్ల రూ పాయలు మంజూరయ్యాయని వెల్లడించారు. పదేళ్లుగా రాష్ట్రాన్ని అన్ని విధాల అన్ని రంగాల్లో బిఆర్ఎస్ పార్టీ వెన క్కు నెట్టిందని, కమీషన్ల కొరకు కక్కుర్తి పడి 7లక్షల కోట్ల అప్పులు మిగిల్చారని డాక్టర్ భూపతిరెడ్డి విమర్శించారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉం చుకుని వైద్యం, విద్య, ఆరోగ్యం, రైతు సంక్షేమం, మహిళా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతుందన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం ఆరోగ్యశ్రీలో 1500 రోగాలు చేర్చామని వైద్యం కోసం 10 లక్షల రూపాయలు వరకు ఆరోగ్యశ్రీ ద్వారా అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్, ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండల కాంగ్రెస్ అధ్యక్షులు అమృతపూర్ గంగాధర్, మోత్కురి నవీన్‌గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు వాసు బాబు, మోహమ్మద్ బాబా, సాయి ప్రసాద్, శ్యామ్ సన్, ధర్మ గౌడ్, మండల కార్యదర్శి లచ్చమొల్ల దత్తాద్రి, గుడి నరేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొలసాని శ్రీనివాస్, నేరడి దేవరాజ్, రేగుంట రాజారాం, మాజీ ఉప సర్పంచ్ సోమ్ నాథ్, సింగల్ విండో చైర్మన్లు చింత శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణ, ఎంపిడిఓ రవీందర్, ఇందల్‌వాయి ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్, ఎంపిఓ శ్రీనివాస్ గౌడ్, పిఆర్ ఏఈ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతులు..

మండలంలోని ధర్మారంబీ గ్రామంలో ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అందజేశారు. అత్యవసరంగా ఉన్నవాటికి నిధులను మంజూరు చేయడానికి తనవంతు కృషి చేస్తానని, విడతలవారీగా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఆయన హామీనిచ్చారు. అనంతరం ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సద్దాం, రహీం, మహమ్మద్ బాబా, అబ్దుల్ అసద్, ఉస్మాన్, నన్నెసాబ్, పోస్ట్ బాబా, షేక్ అశ్ఫు, షేక్ షాదుల్లా తోపాటు తదితరులున్నారు.

యువతి అదృశ్యం



సింధూజ (ఫైల్)

నవతెలంగాణ-నవీపేట్

పోలీస్ స్టేషన్ పరిధిలోని పొల్గ గ్రామానికి చెందిన యువతి వడ్డేపల్లి సింధూజ (19) అదృశ్యమైనట్లు తల్లి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వినయ్ శనివారం తెలిపారు. యువతి సింధూజ తన తల్లిదండ్రులకు హైదరాబాదులో ఉద్యోగం ఉందని చెప్పి 15 రోజుల క్రితం వెళ్లగా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని ఉండడం ఆచూకీ తెలియకపోవడంతో శనివారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్ఐ వినయ్ కుమార్ తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-భిక్కనూర్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఇంటిలోకి దోమలు వ్యాపించకుండా జాగ్రత్తలు పాటించాలని మెడికల్ అధికారి యేమిమా తెలిపారు. శనివారం పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 100 మందికి వైద్య సేవ నిర్వహించగా అందులో అనారోగ్యానికి గురైన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న 10 మందికి రక్త నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రి పంపించడం జరిగిందని తెలిపారు. సీజనల్ వ్యాధుల కాలంలో మండల ప్రజలు దోమలు రాకుండా ఇంటి పరిసరాలలో నీరు నిలవకుండా చూసుకోవాలని, జ్వరంతో బాధపడుతున్న వారు నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచనలు సలహాలు పాటించాలని తెలిపారు.

సిద్ధ రామేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలో ఉన్న దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయంలో శ్రావణ చివరి శనివారం సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో శ్రీధర్ తెలిపారు. తెల్లవారుజాము నుండి ఆలయంలో ప్రత్యేక పూజలు, భక్తుల అభిషేకాలు నిర్వహించారు. అలాగే జంగంపల్లి గ్రామంలో ఉన్న శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయ సంప్రోక్షణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ భక్తులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని గ్రామాలలో ఓటరు నమోదులో భాగంగా బిఎల్ఓలు, అంగన్వాడీ టీచర్లు ఇంటింటికి తిరిగి శనివారం అవగాహన కల్పించారు. ఓటరు జాబితా నుంచి చనిపోయిన వారిని, పెండ్లి లేదా ఇతరత్ర కారణాలవల్ల ఊరు విడిచిన వారి వివరాలు తొలగించి 18 సంవత్సరాల వయసు నిండిన యువతీయువకులను జాబితాలో చేర్చాలని తహసీల్దార్ జె.మల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సాయిలు, బిఎల్ఓ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌లను వెంటనే నియమించాలి

- బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీకాంత్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్రంలో ఉన్నటువంటి యూనివర్సిటీలతో పాటు తెలంగాణ యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌ను వెంటనే నియమించాలని బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శనివారం యూనివర్సిటీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీకి వీసీ లేక యూనివర్సిటీ అభివృద్ధికి నోచుకోవడం లేదని, అకాడమిక్ వాతావరణం కుంటుపడిందని, పరిపాలన మొత్తం గాడి తప్పిందని తెలిపారు. యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌లను నియమిస్తానని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికి ఆ దిశగా ప్రయత్నం చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రాష్ట్రంలో ఉన్న యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్‌లను నియమించి, అధిక నిధులు కేటాయించి, యూనివర్సిటీలను బలోపేతం చేయాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో తరుణ్, నవీన్, సాయి, పవన్, అనురాగ్, ప్రమోద్, విగ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకోసం స్పాట్ అడ్మిషన్స్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విదేశీ విద్య కోసం నగరంలోని బ్లూ రిబ్బన్ నిజామాబాద్ బ్రాంచ్‌లో స్పాట్ అడ్మిషన్లను శనివారం నిర్వహించారు. ఈ స్పాట్ అడ్మిషన్ కార్యక్రమానికి సింగపూర్ నుండి ఆష్లీ హాజరై పాల్గొని విద్యార్థులందరికి సింగపూర్‌లో చదవటం వలన ఏ విధంగా విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోగలరో సవివరంగా తెలిపారు. అంతేకాకుండా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని నిజామాబాద్‌లో నిర్వహించినందుకు విద్యార్థులందరూ బ్లూ రిబ్బన్ నిజామాబాదు బ్రాంచ్ డైరెక్టర్ శ్రీనివాస్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాదు బ్రాంచ్ పార్టనర్స్ అయిన కరుణాకరరెడ్డి, మహేష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నిజామాబాదులో విదేశీ విద్య అందించటంలో ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.

కస్తూర్బా పాఠశాలను సందర్శించిన తహసీల్దార్

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను తహసీల్దార్ శ్రీలత శనివారం సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థుల తరగతి గదులు, బస చేసే, వంట చేసే గదులను, మూత్రశాలలను, పాఠశాల పరిసరాలను, పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు అత్యవసర సేవలు అందించే సిబ్బంది కచ్చితంగా అందుబాటులో ఉండాలని అన్నారు. వర్షాకాలం కావున పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పాఠశాల పరిసరాల్లో గడ్డి ఏపుగా పెరగకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శితో మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారమే భోజనం అందించాలని పాఠశాల ఎస్.ఓ.కు సూచించారు. పాఠశాల ఎస్.ఓ సంధ్యారాణి, ఉపాధ్యాయినులు, కస్తూర్బా సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి బాలుర ఉన్నత పాఠశాలలో

- రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీలు

నవతెలంగాణ-ఆర్మూర్

ఎనిమిదవ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అంతర్ జిల్లా బాల బాలికల టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీలను బాలుర ఉన్నత పాఠశాలలో నేటి నుంచి నిర్వహించనున్నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనరసయ్య, పిడి మల్లేష్ గౌడ్ శనివారం తెలిపారు. ఇందులో 20 నుండి 24 జిల్లాల నుండి జిల్లాకు 10 పదుగురు చొప్పున (4గురు బాలరు, 4గురు బాలికలు, 2 కోచ్‌లు) పాల్గొంటున్నట్టు పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు జమ్మూ కాశ్మీర్‌లో అక్టోబర్ 4న జరిగే జాతీయ టెన్నికాయిట్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర తరపున పోటీ పడుతారని తెలిపారు.

సమాచార శాఖ(ఏ.ఆర్.ఈ) సీనియర్ అసిస్టెంట్‌కు ఘనంగా వీడ్కోలు



రవూఫ్‌ను సన్మానించిన తోటి సిబ్బంది

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ (ఏ.ఆర్.ఈ) విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించి శనివారం ఉద్యోగ విరమణ చేసిన ఎం.డీ.రవూఫ్‌కు ఆ శాఖ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ముప్పై సంవత్సరాల పాటు రవూఫ్ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా సుభాష్‌నగర్లోని ఏ.ఆర్.ఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో పూల మాలలు, శాలువాలతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. సమాచార శాఖలో ఆయన అందించిన సేవలను సహచర అధికారులు, సిబ్బంది కొనియాడుతూ, శేష జీవితం ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. తన ఉద్యోగ నిర్వహణలో సహకరించిన ప్రతి ఒక్కరికి రవూఫ్ కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు, సిబ్బంది అందరి తోడ్పాటుతోనే తాను ఎలాంటి రిమార్క్ లేకుండా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించగలిగానని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ సమాచార ఇంజనీర్ ఉమేష్ చంద్రారావు, రిటైర్డ్ అధికారి కె.రాములు, డీపీఆర్ఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మాజిద్, బాలాజీ, హైమద్ పాషా, సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా వసతి గృహ సంక్షేమ అధికారుల నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా వసతి గృహ సంక్షేమ అధికారుల జనరల్ ఎలక్షన్స్‌లో మూడు డిపార్ట్మెంట్ల(ఎస్సీ,ఎస్టీ,బీసీ) తరఫున ఏకగ్రీవ ఎన్నిక నిర్వహించినట్లు నూతన సెక్రటరీగా ఎన్నికైన సౌడ సురేష్ శనివారం తెలిపారు. ఇందుకు సహకరించిన రాష్ట్ర వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం అధ్యక్షులు గౌస్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు అలుక కిషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘానికి అధ్యక్షులుగా ఏర్దండి మచ్చేందర్, సెక్రటరీగా సౌడ సురేష్, ట్రెజరీగా అంజాద్ ఇతర ప్యానెల్ మెంబర్లుగా ఎన్నికైన అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని వసతి గృహ అధికారులు అందరి ఆశయాలకు అనుగుణంగా నూతన బాడీ పనిచేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో వెనుకబడ్డ నిజామాబాద్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా విద్యారంగంలో వెనుకబడ్డదని పలు విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. టీజీవిపి జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి టీజీవిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సజ్జనం భానుచందర్ హాజరయ్యారు. ఏఐఎస్ఎఫ్, టీ.వీ.యు.వి, ఏబిపిఎస్యు సంఘాల నాయకులు పాల్గొని నిజామాబాద్ జిల్లా విద్యారంగ వెనుకబాటుపై తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా టీజీవిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు భానుచందర్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల కాలంగా నిజామాబాద్ జిల్లా విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించడం లేదని ఉన్న విద్యా వ్యవస్థలలోనే సమస్యలను పునరావృతం చేస్తూ ప్రజల, విద్యార్థుల, విద్యార్థి సంఘాల దృష్టి మరలించే ప్రయత్నం చేస్తూ జిల్లాకు కొత్తగా ఎటువంటి విద్యావ్యవస్థలను కేటాయించకుండా మొండి చేయి చూపిస్తున్నాయన్నారు. నిజామాబాద్ జిల్లాలో బీటెక్ కళాశాల ఏర్పాటు చేస్తామని చెప్పి పనులు మొదలుపెట్టి నిధుల కేటాయింపులో జాప్యం జరపడం సబబు కాదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. త్వరితగతిన బీటెక్ కళాశాలకు సంబంధించిన పూర్తిస్థాయి నిధులను విడుదల చేసి విద్యార్థులకు కళాశాలను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు రఘురాం మాట్లాడుతూ గత ప్రభుత్వం కేవలం కుటుంబ పాలనకే పరిమితమైందని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా జిల్లాకు వెటర్నరీ కాలేజ్ కేటాయింపు జరపాలని కోరారు.



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

పేద మధ్య తరగతి విద్యార్థులు వెటర్నరీ కాలేజ్ ఏర్పాటు చేయడం వల్ల పశు సంక్షేమ శాఖకు సేవలు అందించే స్థాయిలో ఎదుగుతారని ఆయన ఆశించారు. అనంతరం ఏబీపీఎస్‌యూ నాయకుడు బోడ అనిల్ మాట్లాడుతూ జిల్లాకు ఫార్మా కళాశాల ఆవశ్యకత ఎంతైనా ఉందని జిల్లాలో ఉన్నటువంటి విద్యార్థులకు ఫార్మా కళాశాల అందుబాటులోకి తెస్తే వైద్యరంగంలో జిల్లా ముందుంటుందని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి పై సమస్యలన్నీటిపైన స్పందించి జిల్లాకుతగు న్యాయం చేయాలని కోరారు. టీవీయువి సంఘం నాయకుడు లాల్ సింగ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వంలో కాకుండా విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌గా కేవలం గిరిరాజ్ కాలేజ్ మాత్రమే ఉందని అది కాకుండా ఉమెన్స్ డిగ్రీ కళాశాల అనుబంధంగా హాస్టల్‌తో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తెలంగాణ విద్యార్థి పరిషత్ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్ రామ్ మాట్లాడుతూ వివిధ విద్యార్థి సంఘాలు వెలిబుచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని రానున్న రోజుల్లో తెలంగాణ విద్యార్థి పరిషత్ సమస్యలన్నీటిపైన ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజీవీపీ బోధన్ డివిజన్ అధ్యక్షుడు మీసాల నాగేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు, ఏబిపిఎస్యు నాయకులు, టీవీయువి నాయకులు పాల్గొన్నారు.

ఆడిపాడే వయసులో అనారోగ్యం

- షుగర్, లివర్ సమస్యతో బాధపడుతున్న మూడేండ్ల బాలుడు
- ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని బాబాపూర్ గ్రామంలో ఎల్లోల అనూష - సురేష్ దంపతులకు రెండవ కుమారుడు రితిక్ 2021లో జన్మించాడు. పుట్టినప్పటినుంచి ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో హాస్పిటల్లో చూయించారు. షుగర్ వ్యాధితో పాటు లివర్ ఇన్ఫెక్షన్ కావడంతో నెల రోజులు పాటు నిజామాబాద్, హైదరాబాద్ ఆస్పత్రుల్లో అడ్మిట్ ఉంచారు. చికిత్స జరుగుతున్న సమయంలో హార్ట్ ఎటాక్ వచ్చింది. ప్రస్తుతం బాలుడు చికిత్స పొందుతున్నాడు. తమ బాలుడికి ఆస్పత్రుల్లో చూయించేందుకు తల్లిదండ్రులు ఆర్థికంగా చితికిపోయారు. ఆర్థిక ఇబ్బందులతో ప్రస్తుతముంటున్న ఇల్లును కూడా అమ్మివేశారు. వీరి ఆర్థిక ఇబ్బందులను చూసిన బాబాపూర్ గ్రామాల్లో ఉన్న యువకులు యూత్ పిల్లలు చందారూపకంగా కొంత ఆర్థికసాయాన్ని అందజేశారు.



అనారోగ్య సమస్యతో బాధపడుతున్న రితిక్

ప్రస్తుతం రిత్విక్‌కు రోజుకు ఇంజక్షన్లు, మందుల కోసం రూ.4నుంచి 5 వేలు ఖర్చవుతోంది. ఆరోగ్యశ్రీ చేయిద్దామనుకున్నప్పటికీ కూడా రేషన్ కార్డు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాతలు, ప్రభుత్వం దయచూపి తమ బాలుడిని వైద్య సేవల కోసం ఆర్థికంగా ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

ఘనంగా ఉపాధ్యాయుని ఉద్యోగ విరమణ

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని తట్టికోట హైస్కూల్‌లో బయోసైన్స్ ఉపాధ్యాయునిగా పనిచేసిన శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ మూడు దశాబ్దాలపాటు ఉపాధ్యాయులుగా సేవలు అందించి, విద్యార్థుల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్ది, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు పొందిన శ్రీనివాసరావు సేవలు మరువలేనివని అన్నారు. పనిచేసిన ప్రతి పాఠశాలను నందనవనంగా తీర్చి దిద్ది, ప్రకృతి ప్రేమికుడిగా ఆయన జిల్లా స్థాయిలో వృక్షమిత్ర అవార్డు పొందారని, ఉపాధ్యాయ సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేసి స్టేట్ టీచర్స్ యూనియన్‌లో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో పదవులను చేపట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు బాలచంద్రం, సలీం, కిశోర్, వీరప్ప, బస్వరాజు తదితరులు పాల్గొన్నారు.

మినీ ట్రక్ ర్యాలీ చోరీ

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలోని మేకల సంతకు వచ్చిన మిని ట్రక్ ర్యాలీని శనివారం గుర్తుతెలియని వ్యక్తి దొంగలించగా దొంగలించిన దృశ్యం సీసీ టీవీ పుటిజీలో లభ్యం కావడంతో పూటేజీ ఆధారంగా నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీష్, ఎస్ఐ వినయ్ కుమార్ దర్యాప్తు ప్రారంభించారు. ఎవరికైనా వాహనం లేదా వ్యక్తి కనిపించిన సీఐ 8712659845, ఎస్సై 8712659843 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్.బి.ఎస్.కె ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఏడుగురు విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించామని డాక్టర్ రాజేశ్వర్ తెలిపారు. దృష్టి లోపం రాకుండా విద్యార్థులకు తగు సలహాలు, సూచనలు అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి, వైద్యులు గురురాజ్, అరుణ్, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.